నీలగిరి ఎక్స్‌ప్రెస్

RNI - TELTEL/2023/87644

తెలుగు దినపత్రిక

నీలగిరి నిత్యపద్యం

గణితము బ్రతుకున ముఖ్యము
గణితమె సంకటములెల్ల గడతేర్చునురా
గణితమె కూర్మిని గూర్చును
గణితమె సర్వము మనకును కదరా విజయా

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.

సంచిక 38 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | ఆగస్టు 06, 2026 | పేజీలు-8 | వెలః రూ. 5.00

మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ

ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి

ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు

ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన

దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ

2లో.

తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

తుమ్మిడిహట్టి పెంపునకు ఒత్తడి తెండి

మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి

కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి

అటవీ పర్యావరణ అనుమతులుపై భూపేంద్రయాదవ్‌తో చర్చ

ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి

బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

న్యూఢిల్లీ, ఆగస్టు 5 :
తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు.150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. **మిగతా 2లో...**

తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

గోదావరి రివర్ బోర్టు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు

18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్,ఆగస్టు 5 :
ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం **మిగతా 2లో...**

తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

డయల్ 112తో అన్ని సేవలు

ఒకే నంబర్‌తో పోలీస్, అంబులెన్స్, ఫైర్ సేవలు

హైదరాబాద్‌లో కొత్త కాల్ సెంటర్‌ను ప్రారంభించిన డీజీపీ

కాలర్ లొకేషన్‌ను గుర్తించి వెంటనే ఆయా సేవలకు సమాచారం

సమీప బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకునేలా చర్యలు

ఏడాది పొడవునా 24 గంటలు 112 సేవలు అందుబాటులో

అత్యవసర సేవల్లో ఏఐ వినియోగాన్ని పెంచనున్నట్లు డీజీపీ వెల్లడి

2లో.

విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

ఇది బహుళ క్రీడా కేంద్రం, సీఎం చంద్రబాబు సూచనతోనే రూపకల్పన

సంస్థలే ఛాంపియన్లను నిర్మిస్తాయని, క్రీడలు వ్యక్తిత్వాన్ని పెంచుతాయని వ్యాఖ్య

ఏపీని క్రీడాకారులను తయారు చేసే గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యం

ప్రతి బిడ్డలో స్ఫూర్తి నింపిన సింధుకు లోకేశ్ అభినందనలు

2లో.

రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

: కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శనాస్త్రాలు

దేవరపల్లిలో పొగాకు రైతులను కలిసిన వైఎస్ జగన్

అమరావతి,ఆగస్టు 5 :
వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్.. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన, పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విధ్వంసం సృష్టిస్తోందని **మిగతా 2లో...**

హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..

8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!

నకిలీ ఎన్ఓసీ పత్రాలను తయారు చేసిన ముఠా గుట్టు రట్టు

పోలీసులకు ఫిర్యాదు చేసిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు

హైదరాబాద్,ఆగస్టు 5 :
హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' పేరును వాడుకుని కొందరు అక్రమాలకు యత్నించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ 'ఫైర్ ఎన్ఓసీ' (చీజా) పత్రాలను తయారు చేసిన ఒక ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా నగరంలోని 8 ప్రముఖ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు పొందేందుకు యత్నించడం విద్యాశాఖతో పాటు పోలీసు వర్గాలను **మిగతా 2లో...**

22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు

ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి

అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి

జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు

హైదరాబాద్,ఆగస్టు 5 :
రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత **మిగతా 2లో...**

రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు

దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం

సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ

ముంబై, ఆగస్టు 5(పిసిడబ్ల్యూ న్యూస్):
జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు **మిగతా 2లో...**

అమెరికాలో భారతీయుల ఘనత..

'ఇండియా డే'గా ప్రకటిస్తూ మసాచుసెట్స్ గవర్నర్ ఉత్తర్వులు!

ప్రవాస భారతీయుల సేవలకు గుర్తింపుగా గవర్నర్ మౌరా హీలీ ప్రకటన

బోస్టన్ నగరంలోనూ 'ఇండియా డే'గా పాటిస్తూ మేయర్ ఉత్తర్వులు

భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు భారత సంఘాల సన్నాహాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5 :
అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీని 'ఇండియా డే'గా అధికారికంగా జరపాలని ఆ రాష్ట్ర గవర్నర్ మౌరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం **మిగతా 2లో...**

రైతులు ఆత్మహత్యలు పట్టవా ?

మొదటిపేజీ తరువాయి

ఆయన ఆరోపించారు.పొగాకు బ్యారన్లను పరిశీలించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో పొగాకుకు సగటున రూ.289 ధర పలికింది. కొందరు రైతులు రూ.365 వరకు కూడా పొందారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చాక ధర రూ.236కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరుగుతుంటే, గిట్టుబాటు ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు" అని జగన్ అన్నారు. ప్రభుత్వం కేవలం 21 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసిందని, మిగిలిన పంట విషయంలో వ్యాపారులు, సిండికేట్లతో కుమ్మక్కై రైతులను దగా చేస్తోందని విమర్శించారు.

గిట్టుబాటు ధర లేకపోవడంతో వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని జగన్ వెల్లడించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ వెళ్లకపోవడం దారుణమన్నారు. తమ హయాంలో అమలు చేసిన సున్నా వడ్డీ రుణాల పథకాన్ని, రైతు భరోసా కింద అదనంగా ఇచ్చే సహాయాన్ని రద్దు చేశారని, ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

అమెరికాలో భారతీయుల ఘనత..

మొదటిపేజీ తరువాయి

పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు.1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు. వైద్యం, టెక్నాలజీ, విద్య, వ్యాపారం వంటి రంగాల్లో ఇండియన్-అమెరికన్లు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అమెరికాలో నివసిస్తున్న 50 లక్షల మంది సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3.6 కోట్ల మంది ప్రవాస భారతీయుల పాత్రను ఆమె గుర్తుచేశారు.మరోవైపు, బోస్టన్ నగర మేయర్ మిషెల్ వూ కూడా ఆగస్టు 15ను 'ఇండియా డే'గా ప్రకటిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.బోస్టన్‌లో కొత్తగా భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆమె స్వాగతించారు.గవర్నర్, మేయర్ల నిర్ణయంపై 'ఇండియా అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్' (ఐఏజీబీ) వంటి భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బోస్టన్ హార్బర్ వద్ద భారీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అమెరికా గడ్డపై భారతీయ సమాజానికి లభించిన ఈ గౌరవం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

మొదటిపేజీ తరువాయి

ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణలో ఎమర్జెన్సీకి ఇక ఒకే నంబర్..

హైదరాబాద్,ఆగస్టు 5

తెలంగాణలో అత్యవసర సేవల కోసం ఇకపై ఒకే నంబర్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు వేర్వేరు నంబర్లను ఉపయోగించగా, ఇక నుంచి వాటన్నింటికీ డయల్ 112 అమల్లోకి వచ్చింది. హైదరాబాద్‌లో కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు.కొత్త విధానంతో పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సహా ఇతర అత్యవసర సేవలు ఒకే వేదికపైకి వస్తాయి. రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, మహిళలపై వేధింపుల వంటి అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే స్పందన లభించేలా వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ తెలిపారు.ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కాల్స్‌ను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ వచ్చిన వెంటనే కాలర్ వివరాలు, లొకేషన్‌ను గుర్తించి సమీప పోలీస్ స్టేషన్, అగ్నిమాపక సిబ్బంది, అవసరమైన బృందాలకు సమాచారం పంపిస్తారు. దీంతో సహాయక చర్యలు మరింత వేగంగా ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు.డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత విస్తృతంగా వినియోగించి అత్యవసర సేవల సామర్థ్యాన్ని పెంచాలని తెలంగాణ పోలీస్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.

హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ..

మొదటిపేజీ తరువాయి

తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. హైడ్రా కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, కమిషనర్ పేరు మీద దొంగ సంతకాలతో ఫేక్ ఎన్ఓసీలు సృష్టించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ (అనుమతులు) సాధించడం కోసం సదరు ప్రైవేటు కాలేజీలు ఈ నకిలీ పత్రాలను సమర్పించాయి. అయితే బోర్డు అధికారులు, హైడ్రా యంత్రాంగం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని, వారి సంతకాలు ఫోర్జరీకి గురయ్యాయని తేలింది. ఈ దారుణ అక్రమంపై స్పందించిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు.. మోసానికి పాల్పడిన 8 కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

ఫోర్జరీకి పాల్పడిన జూనియర్ కాలేజీలు ఇవే:

శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, చాంద్రాయణగుట్ట,రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్
హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర,ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం
న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి,మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్
షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి, వశిష్ట జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

మొదటిపేజీ తరువాయి

ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు.

తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

మొదటిపేజీ తరువాయి

150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపు ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్‌ఎస్‌పీ ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు. ఇకపోతే ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.

విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన

మొదటిపేజీ తరువాయి

అమరావతి,ఆగస్టు 5 :

ఒలింపిక్ పతకాలను అథ్లెట్లు గెలుస్తారని, కానీ ఆ ఒలింపిక్ కలలను సాకారం చేసేది అకాడమీలేనని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పీవీ సింధు అకాడమీ అలాంటి ఛాంపియన్లను తయారుచేసే గొప్ప సంస్థగా ఎదుగుతుందని ఆయన ఆకాంక్షించారు. బుధవారం విశాఖపట్నంలో 'పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' శంకుస్థాపన కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ అకాడమీ కేవలం ఒక భవనం కాదని, భావి భారత ఛాంపియన్లకు పునాది అని ఆయన అభివర్ణించారు.ఈ అకాడమీ ఏర్పాటు వెనుక ఉన్న స్ఫూర్తిదాయక నేపథ్యాన్ని లోకేశ్ వివరించారు. "పీవీ సింధు తన హృదయానికి దగ్గరైన ఒక కలతో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఒక బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మించాలనే తన ఆశయాన్ని పంచుకున్నారు. కానీ, మన ముఖ్యమంత్రి ఎప్పుడూ ఉన్నదాని కంటే గొప్పగా ఆలోచించమని సవాల్ విసురుతారు. ఆయన సింధుతో 'కేవలం బ్యాడ్మింటనే ఎందుకు? అంతకు మించి ఆలోచించు. వివిధ క్రీడల్లో నైపుణ్యం ఉన్న పిల్లలందరికీ శిక్షణ ఇచ్చే ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మించు' అని ప్రోత్సహించారు. ఈ రోజు మనం చూస్తున్న ఈ బృహత్ కార్యం ఆ దార్శనికతకు ప్రతిరూపం" అని లోకేశ్ తెలిపారు. ఇది కేవలం ఒక సౌకర్యం నిర్మించడం కాదని, ఒక వారసత్వాన్ని నిర్మించడం అని ఆయన అన్నారు.

ప్రభుత్వ విధానాలను వివరిస్తూ, చదువుతో పాటు క్రీడలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. "తరగతి గది జ్ఞానాన్ని నిర్మిస్తే, క్రీడా మైదానం వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది. అందుకే రాష్ట్రంలోని పాఠశాలల్లో శనివారాలను 'నో బ్యాగ్ డే'గా ప్రకటించాం. విద్యార్థులకు నచ్చిన క్రీడను ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చి, వారికి అవసరమైన క్రీడా పరికరాలను అందిస్తున్నాం" అని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, గౌరవం, ఓటమిని ఎదుర్కొనే ధైర్యాన్ని నేర్పుతాయని, అందుకే ప్రతి బిడ్డ ఒక క్రీడ ఆడాలని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో సైబర్ సిటీ నిర్మిస్తున్నప్పుడు చాలా మంది సందేహాలు వ్యక్తం చేశారని, కంప్యూటర్లు కడుపు నింపుతాయా అని ప్రశ్నించారని లోకేశ్ గుర్తుచేశారు. "కానీ ఆ ఒక్క భవనం హైదరాబాద్‌లో ఐటీ విప్లవానికి నాంది పలికింది. అదేవిధంగా, ఈ అకాడమీ కూడా ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో ఒక విప్లవాత్మక మార్పునకు ఉత్ప్రేరకంగా నిలుస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ దత్తాత్రేయకు 18 నెలల గడువు విధిస్తూ, 2028 మే నాటికి రిబ్బన్ కటింగ్ ఉండాలని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌ను కేవలం గొప్ప విద్యార్థులు, పరిశ్రమలకే కాకుండా, గొప్ప క్రీడాకారులను తయారుచేసే గమ్యస్థానంగా మార్చడమే తమ కల అని లోకేశ్ అన్నారు. "ఈ అకాడమీ గేట్ల నుంచి ఒకనాడు ఆశతో అడుగుపెట్టిన చిన్నారి, కొన్నేళ్ల తర్వాత ఒలింపిక్ స్టేడియంలో మన మువ్వన్నెల జెండాను మోస్తుంది. ఆ ప్రయాణం ఇక్కడే ప్రారంభమైందని మనమందరం గుర్తుంచుకుంటాం. 'సింధు చేయగలిగితే, నేను కూడా చేయగలను' అని ప్రతి బిడ్డ నమ్మాలి" అని పిలుపునిచ్చారు. విశాఖను ఎంచుకున్నందుకు సింధుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రభుత్వ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

మళ్లీ కీలక వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ

రెపో రేటు 5.25 శాతంగానే కొనసాగించిన ఆర్‌బీఐ
ద్రవ్య విధానంలో తటస్థ వైఖరి
ఎస్‌డీఎఫ్ 5%, ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేటు 5.5%గా కొనసాగింపు
ప్రపంచ వాణిజ్య అనిశ్చితిపై ఆర్‌బీఐ ఆందోళన
దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందన్న ఆర్‌బీఐ

న్యూఢిల్లీ, ఆగస్టు 5 :

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం తర్వాత రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న వాణిజ్య అనిశ్చితి దృష్ట్యా తటస్థ వైఖరినే కొనసాగిస్తున్నట్టు వెల్లడించింది. రెపో రేటులో మార్పు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న హోమ్ లోన్, వాహన రుణం, వ్యక్తిగత రుణాల ఈఎంఐలు వెంటనే పెరగవు. కొత్త రుణాలపై కూడా బ్యాంకులు ప్రస్తుత వడ్డీ రేట్లనే కొనసాగించే అవకాశం ఉంది.ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. అమెరికా కొత్త సుంకాలు విధించడం వల్ల ప్రపంచ వాణిజ్య పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతోందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రభావంతో ముడి చమురు ధరలు, ఆర్థిక మార్కెట్లు ఇంకా ఒడుదొడుకులకు లోనవుతున్నాయని చెప్పారు.

స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 5 శాతంగానే కొనసాగించారు. మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్‌ఎఫ్) రేటు, బ్యాంక్ రేటును 5.5 శాతంగా యథాతథంగా ఉంచారు.

ద్రవ్యోల్బణం ఇటీవల కొంత పెరిగినా ఆర్‌బీఐ నిర్దేశించిన పరిమితుల్లోనే ఉందని గవర్నర్ తెలిపారు. ముడి చమురు ధరల పెరుగుదల, రూపాయి మారకపు విలువలో మార్పులు, పశ్చిమాసియా పరిణామాలు ఆర్‌బీఐ నిర్ణయాలపై ప్రభావం చూపుతున్న ప్రధాన అంశాలుగా పేర్కొన్నారు.

మరోవైపు దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. వృద్ధి రేటులో ఊపు కొనసాగడం, సానుకూల వర్షపాతం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని వెల్లడించింది.

అయితే కొన్ని రంగాల్లో ప్రారంభ దశ ఒత్తిడి కనిపిస్తోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి అంచనాల చుట్టూ ఇంకా గణనీయమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయని వ్యాఖ్యానించారు.

జూన్‌లో జరిగిన గత ఎంపీసీ సమావేశంలో కూడా రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగించారు. అదే సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి ఆర్‌బీఐ తగ్గించింది. ప్రపంచ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, ఇంధన ధరల పెరుగుదల ఇందుకు కారణాలని అప్పట్లో పేర్కొంది.

తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

మొదటిపేజీ తరువాయి

ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టారు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జీఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన వట్టించుకోలేదా..? అనలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్ధా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపా

ఇంధన్‌పల్లి ఘటనలో బాధితులను పరామర్శించిన భూక్యా జాన్సన్ నాయక్

ఖానాపూర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఇంధన్‌పల్లి రేంజ్‌లో అటవీ శాఖ అధికారుల దాడికి గురైన ఆదివాసీ యువకులను బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియో జకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అటవీ ఆంక్షలు, టైగర్ జోన్ పేరుతో ఆదివాసీ, గిరిజనులను వేధించడం అమానుషమని, సంబంధిత అధికారిని సస్పెండ్ చేయడం సరైన చర్య అయినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలని డిమాండ్ చేశారు. ఉడుంపూర్‌లో రైతులు పొలాలు దున్నుకుంటుంటే అటవీ అధికారులు అడ్డుకున్న ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి దౌర్జన్యాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ, రాజ్యాంగం, అటవీ హక్కుల చట్టం--2006, పీసా చట్టం--1996 ఆదివాసుల హక్కులను రక్షిస్తున్నప్పటికీ అధికారులు వాటిని ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు భూముల సమస్య పరిష్కరించి పట్టాలు ఇచ్చిందని, కానీ ప్రస్తుతం అదే హక్కులను ప్రశ్నించడం బాధాకరమని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ టైగర్ జోన్, అటవీ ఆంక్షల పేరుతో వేధింపులు మొదలయ్యాయని, ఇది ప్రజల హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం ఆదివాసులను వేధిస్తున్నాయని ఆయన ఆరోపించారు.అడవుల్లో నివసిస్తున్న కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం, రహదారులు, తాగునీటి పథకాలు, విద్యుత్ లైన్ల కోసం ప్రత్యేక అటవీ అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ, గిరిజనుల హక్కులను పరిరక్షించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

మున్సిపల్ పరిధిలో శుభ్రత కార్యక్రమాల నిర్వహణ

ఖానాపూర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.12వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ తుడసం ఇందిరా ఆధ్వర్యంలో డ్రైనేజీలు శుభ్రం చేశారు. వర్షాల కారణంగా ఇసుక, మట్టి పేరుకుపోవడంతో మున్సిపల్ సిబ్బందితో తొలగింపులు చేపట్టారు. అలాగే 11వ వార్డులో కౌన్సిలర్ రాజురా సత్యం ఆధ్వర్యంలో పరిసరాల్లో పెరిగిన మొక్కలు, చెట్లను తొలగించారు. ట్రాక్టర్‌తో శుభ్రతా పనులు నిర్వహించడంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ పరిశీలకుడు మానాల శంకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా మెహందీ ఉత్సవం

ఖానాపూర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లింగాపూర్ ఉన్నత పాఠశాలలో మెహందీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళా టీచర్లు ఒకరికి ఒకరు చేతులకు గోరింటాకు వేసుకున్నారు. గోరింటాకు ప్రేమకు, శుభానికి సూచన అని, ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తుందని హెడ్‌మాస్టర్ బి. వెంకటరమణ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు ఆటలు, పాటలతో ఆనందంగా గడిపారు. ఈ ఉత్సవంలో టీచర్లు ఎన్. శ్రీదేవి, కృష్ణవేణి, కళావతి, ఉషారాణి, జయంతి, స్వప్న, మిడ్‌డే మీల్స్ మహిళా సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీసీ ఎమ్మెల్యే గెలుపే లక్ష్యం కొలిపాక శ్రీనివాస్

పెద్దపల్లి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వచ్చే శాసనసభ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గం నుంచి బీసీ ఎమ్మెల్యేను గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ తెలిపారు.బహుజన రాజ్య స్థాపన కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. పెద్దపల్లి పట్టణంలోని 25వ వార్డులో కుక్క చరణ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీ లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరడం ఆనందదాయకమని, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు బహుజన వర్గాల అభ్యున్నతే పార్టీ ప్రధాన లక్ష్యమని శ్రీనివాస్ పేర్కొన్నారు.కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్, కుక్క కనకరాజు, మెహరాజ్, మాచర్ల సాగర్, కుక్క అజయ్, కుక్క ఆదర్శ్, పేర్క నరేష్, చిలుక శశికుమార్, ఈర్ల గోపిచంద్, కుక్క రాజు, కుక్క దేవయ్య, కుక్క లక్ష్మయ్య, కుక్క రామస్వామి, ఈర్ల సాయి ప్రసన్న, రామగళ్ల ధనశ్రీ, కుక్క జీవన్, ఈర్ల నికిత, కుక్క సౌమ్య, చిలుక మల్లిక, ఎరుగురాల సుమలత, బొంకూరి నిర్మల, కుక్క విజయ, తుంగపిండి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన రైజింగ్ సన్ విద్యార్థి

పెద్దపల్లి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి గౌస్ పాషా అండర్--6 విభాగంలో ప్రతిభ కనబరిచాడు. ఎన్టిపిసి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన పోటీల్లో 60 మీటర్లు, 150 మీటర్లు, స్టాండింగ్ జంప్ విభాగాల్లో బంగారు, కాంస్య పథకాలు సాధించి ఛాంపియన్‌గా నిలిచాడు.ఈనెల 7న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆయన ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తగురం తిరుపతి తెలిపారు.పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయుడు హకీమ్ ఖాన్ గౌస్ పాషాను అభినందించారు.

అయ్యప్ప ధర్మ ప్రచార సభ నూతన కమిటీ ఏర్పాటు

పెద్దపల్లి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలో నూతన బ్రాంచ్ కమిటీ ఆవిర్భావ సమావేశం శివాలయంలో ఘనంగా జరిగింది. గురుస్వామి మూల బాలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర వాలంటీర్ కమాండంట్ జనగామ తిరుపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ధర్మ ప్రచారం కోసం శంఖారావం పూరించారు. అనంతరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మూల బాలయ్య, కార్యదర్శిగా మోర గణపతి, ఉపాధ్యక్షుడిగా నాగమల్ల భూపతి, సంయుక్త కార్యదర్శిగా సూత్రాల వెంకటేష్, కోశాధికారిగా మోర సాయి కుమార్, వాలంటీర్ కెప్టెన్‌గా దొనికెని తిరుపతి గౌడ్, ఇతర సభ్యులుగా బుర్ర మనివర్ధన్, గుండు చందు, చింతల సూర్యప్రకాశ్, కట్ల

అరుణ్, గుండ అనిల్ కుమార్, కత్తెర్ల శ్రావణ్, మామిడి అరుణ్ రెడ్డి, వేల్పుల సంపత్, తమ్మనవేని శేఖర్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, అయ్యప్ప ధర్మ ప్రచారం, సామాజిక సేవా కార్యక్రమాలు, పడి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి, సంస్థను జిల్లాలో మరింత బలపరచడానికి కృషి చేస్తామని తెలిపారు. జనగామ తిరుపతి మాట్లాడుతూ, సంస్థ లక్ష్యాలు, ధర్మ ప్రచార కార్యక్రమాలను వివరించి, ఈ నెల 9న గోదావరిఖనిలో జరిగే జిల్లా సమావేశంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పేద అయ్యప్ప భక్తులను సన్నిధానం తీసుకువెళ్లడం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం వంటి తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ కెక్కర్ల లింగయ్య, మాజీ ఈసీ మెంబర్ ముత్యాల సతీష్, అన్నపూర్ణ కాలనీ బ్రాంచ్ అధ్యక్షుడు వేదాంతం శేషు కుమార్, గోదావరిఖని బ్రాంచ్ కార్యదర్శి ఆర్.ఎస్. మూర్తి, పెద్దపల్లి బ్రాంచ్ అధ్యక్షుడు జక్కుల శ్రీనివాస్, ఇతర నాయకులు, స్థానిక స్వాములు పాల్గొన్నారు.నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి, అయ్యప్ప స్వామి సాక్షిగా ప్రమాణ స్వీకారం నిర్వహించారు.

ఆగస్టు 15లోపు డివిజన్ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలి

– వైద్యుల అంజన్ కుమార్

కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పార్టీ బలోపేతమే లక్ష్యంగా డివిజన్ కమిటీలను ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ అల్టిమేటం జారీ చేశారు.డివిజన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి కమిటీ 21 మంది సభ్యులతో ఉండాలని స్పష్టం చేశారు.పార్టీ బలోపేతం కోసం ప్రతి నెల కనీసం మూడు సమావేశాలు నిర్వహించాలని, 10 డివిజన్లకు ప్రత్యేక ఇన్‌చార్జిలను నియమించి కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వరుసగా మూడు కార్యక్రమాలకు హాజరు కాని

అధ్యక్షులు, సభ్యులను పదవుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇచ్చినా అందరూ కలిసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని, పార్టీ ఇచ్చిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని ఆయన సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అర్హులైన ఓటర్లను నమోదు చేసి, అనర్హులను తొలగించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పర్వత మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, మడుపు మోహన్, కామ్‌రెడ్డి రామ్‌రెడ్డి, వంగల విద్యాసాగర్, గంట కళ్యాణి, మూల రవీందర్ రెడ్డి, నేహాల్ ఇమ్రాన్ ఫహద్, కోడూరు రవీందర్ గౌడ్, దన్న సింగ్, కుంభాల రాజ్‌కుమార్, కలీముద్దీన్, రేగొండ సందీప్, పొన్నం మధు, అమేర్ వసీం, రతన్ రాజు, మిరియాల రవీందర్ రెడ్డి, మూల జైపాల్, గడప అజయ్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, కొలగాని అనిల్, సత్తినేని శ్రీకాంత్, బషీరుద్దీన్, అహమ్మద్ అలీ, హాజీ సాయిని, తిరుపతి ఖదీర్, దండి రవీందర్, మంద మహేష్, ఇమ్రాన్ ఘనీ, కపిల్ మాధవ్, పెంట శేఖర్, అట్టేపు వేణు, శిల్ప, రోళ్ళ సతీష్, జీలకర్ర రమేష్, చిలుక హనుమంత రెడ్డి, జ్యోతి రెడ్డి, వీర దేవేందర్, మాలోతు మహాలక్ష్మి, మాజీద్ అలీ ఖాన్, రాహుల్, అందే శంకర్, హైమద్, స్వప్న, శ్రీ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమాలు నిర్వహణ

కరీంనగర్/హుస్నాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కరీంనగర్, హుస్నాబాద్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ నగరంలోని 57వ డివిజన్ అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్ పాల్గొన్నారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు తల్లికి కూడా ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని వివరించారు. కార్యక్రమం చివరలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ, 5వ వార్డుల్లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ముఖ్య అతిథిగా

పాల్గొన్నారు. ప్రతి తల్లి పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వాలని, రెండు సంవత్సరాల వరకు కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు తల్లి--బిడ్డల ఆరోగ్యానికి మేలు చేస్తాయని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది అవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ, డా. సాయి రాజు, బీసీ సతీష్, ఏఎన్ఎం సుప్రియ, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, మాతృమూర్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.ఆరోగ్యవంతమైన తల్లి -- ఆరోగ్యవంతమైన శిశువు -- ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచులే కీలకం ఎమ్మెల్యే విజయరమణరావు

సుల్తానాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. సుల్తానాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సర్పంచులు తాగునీటి సమస్యలను ప్రస్తావించగా, సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. రైతులకు సాగునీరు అందించేందుకు ఎస్సారెస్పీ కాలువల పూడికతీత పనులు చేపట్టి సుమారు 2,000 ఎకరాలకు నీరు అందేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో

రూ. 50 కోట్లతో బాత్రూములు, ప్రహరీ గోడలు, తాగునీటి సౌకర్యాలు, ప్రాంగణాల అభివృద్ధి వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. సుల్తానాబాద్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సిరిపల్లి పదో తరగతిలో 585 మార్కులతో జిల్లా టాపర్, ఇంటర్మీడియట్‌లో వి. సౌమ్య 994/1000 మార్కులతో రాష్ట్ర టాపర్ కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, ప్రైవేట్ పాఠశాలల నుంచి కూడా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని చెప్పారు. గ్రామాల్లో అవసరమైన వసతులపై సర్పంచులు లిఖితపూర్వక ప్రతిపాదనలు అందజేయాలని, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, తహసీల్దార్ బషీరుద్దీన్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలి
ఎమ్మెల్యే విజయరమణరావు

కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పిలుపునిచ్చారు. బుధవారం గంగారం గ్రామపంచాయతీ పరిధిలోని ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన మూడు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హత, అనుభవం, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలి పారు. కోట్లాది రూపాయలతో పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చదివించే కుటుంబాలను ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హత నుంచి తప్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అయితే, నూతన భవనాల ప్రారంభోత్సవ శిలాఫలకంలో పాఠశాల చైర్‌పర్సన్, ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ పేర్లు లేకపోవడంపై స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ పేరు ఉండి, పాఠశాల యాజమాన్యం పేర్లు లేకపోవడం

సరికాదని, వెంటనే సరిది ద్దకపోతే జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పాఠశాల చైర్‌పర్సన్ పెండ్లి స్వరూప హెచ్చరిం చారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేకుల జ్యోతి రఘు, ఉపసర్పంచ్ అశోక్ గౌడ్, పాఠశాల చైర్‌పర్సన్ పెండ్లి స్వరూప, ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, గ్రామ అధ్యక్షుడు ముసుకు మధూకర్, ఎంపీడీవో, తహసీల్దార్ రాముడు, ఎంఈఓ సిరిమల్ల మహేష్, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఈనెల 20న ఏఐటీయూసీ జిల్లా మహాసభ నిర్వహణ

సుల్తానాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా 4వ మహాసభ ఈ నెల 20న సుల్తానాబాద్‌లోని యశోదనరహరి ఫంక్షన్ హాల్‌లో జరగనుంది.జిల్లా అధ్యక్షుడు వైవీ రావు, ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ మహాసభకు సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. మహాసభలో గత కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించడంతో పాటు కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తీర్మానాలు చేయనున్నారు.అనుబంధ సంఘాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, హమాలీలు, ఐకేపీ, రైస్ మిల్లులు, గోదాములు, రైల్వే, పోస్టల్, ఎల్ఐసీ, ఎన్‌టీపీసీ, ఆర్టీసీ, సివిల్ సప్లైస్‌తో పాటు సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు పాల్గొననున్నారు.మహాసభ సందర్భంగా ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు సుల్తానాబాద్ ఐబీ నుంచి మహాసభ ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్మిక హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి ఈ మహాసభ వేదిక కానుందని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి చిన్నారికి భద్రత, విద్య, సంరక్షణ కల్పించాలి కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లాలోని ప్రతి చిన్నారికి భద్రత, విద్య, సంరక్షణతో పాటు ప్రభుత్వ పరిరక్షణ సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీకృత బాలల సంరక్షణ పథకం సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, అనాథ పిల్లలను పూర్తిస్థాయిలో గుర్తించి వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. చదువు మానేసిన పిల్లలను తిరిగి విద్యాభ్యాసంలోకి తీసుకురావాలని, సీసీఐ హోమ్‌లలో ఉన్న పిల్లలకు అవసరమైన వసతులు, సంరక్షణ, భద్రత కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.పదో తరగతి ఉత్తీర్ణులైన పిల్లలకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కేంద్రాల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఆసక్తి ఉన్న వారి వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు.చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డు పరిధిలోని కేసులు, బాలల గృహాల తనిఖీలు, ఫోస్టర్ కేర్, స్పాన్సర్‌షిప్ పథకాల అమలు, మిస్సింగ్/ఫౌండ్ చిల్డ్రన్ కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఫీల్డ్ విజిట్లు క్రమం తప్పకుండా నిర్వహించి, ఆన్‌లైన్ యాప్‌లలో సమాచారాన్ని ప్రతిరోజూ నవీకరించాలని, పెండింగ్ అంశాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో బాలల సంక్షేమ కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.ప్రతి చిన్నారి భద్రత, విద్య, సంరక్షణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ..

- ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆమనగల్ పోలీసుల సైబర్ అవగాహన కార్యక్రమం

- 200 మంది విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించిన ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఆమనగల్లు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రజల అప్రమత్తతే ప్రధాన ఆయుధమని, యువత ఆన్‌లైన్ లావాదేవీల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆమనగల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే ‘సైబర్ జాగ్రూకత దివస్’ సందర్భంగా బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆమనగల్‌లో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ ఎ. సంతోష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్న నకిలీ పెట్టుబడి పథకాల మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్ మోసాల గురించి విద్యార్థులకు వివరించారు. అపరిచితులతో ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే ఉద్యోగ ప్రకటనలను నమ్మి డబ్బులు చెల్లించవద్దని, పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థల వివరాలను పూర్తిగా ధృవీకరించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసే సమయంలో విశ్వసనీయ వెబ్‌సైట్లు, యాప్‌లను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడంతో పాటు జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించి సురక్షిత సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బందితో పాటు సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని సైబర్ భద్రతపై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ప్రజా సౌకర్యాల మెరుగుదలపై చైర్మన్ పత్యనాయక్ ఫోకస్

- బీసీ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్

అమనగల్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమనగల్ మున్సిపాలిటీ 6వ వార్డులోని బీసీ కమ్యూనిటీ హాల్‌ను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పత్యనాయక్ బుధవారం సందర్శించి అక్కడి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. హాల్ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను గమనించిన ఆయన వెంటనే మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేసి శుభ్రపరిచే పనులను చేపట్టించారు. చైర్మన్ ఆదేశాల మేరకు సిబ్బంది పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించి కమ్యూనిటీ హాల్ పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు పరిశుభ్రంగా ఉండటం ద్వారా ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించవచ్చని డాక్టర్ పత్యనాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఎక్కడ సమస్యలు కనిపించినా వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ హాల్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని, ప్రజా ఆస్తులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీవాసులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పెద్దన్నగా గోలి శ్రీనివాస్ రెడ్డి.. రూ.10 వేల ఆర్థిక సాయం

- మృతుడి కుటుంబానికి పరామర్శ

- గాయపడిన వ్యక్తికి వైద్య ఖర్చుల కోసం చేయూత

ఆమనగల్లు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్): పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. వెల్దండ మండలం చేర్కూర్ గ్రామపంచాయతీలో రెండు కుటుంబాలకు కలిపి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటారు. ఇటీవల మరణించిన చేర్క వెంకటయ్య కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు ద్వారా సమాచారం తెలుసుకున్న గోలి శ్రీనివాస్ రెడ్డి, వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం వారికి తక్షణ సాయంగా రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన వంగూరి లక్ష్మయ్య ప్రమాదంలో కాళ్లకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న గోలి శ్రీనివాస్ రెడ్డి, ఆయనను స్వయంగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల కోసం మరో రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గ్రామ ప్రజలు గోలి శ్రీనివాస్ రెడ్డి సేవాభావాన్ని అభినందిస్తూ, కష్టకాలంలో ఆదుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ సర్పంచ్ అంజి నాయక్, మైసయ్య, మాజీ ఎంపీటీసీ భీమయ్య, ఉప సర్పంచ్ కొండల్, నర్సింహా, నాయకులు తారాసింగ్, మెండే శ్రీను, వార్డు సభ్యులు లాలయ్య, రమేష్, అల్లే సందీప్, సాయి, శ్రీరాములు, బాలయ్య, గడ్డం శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి పునర్జన్మ



కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పదవీ విరమణ పొందిన డీపీవో అధికారి దివంగత వెగ్గిలం చంద్రమౌళి మరణానంతరం ఆయన కుటుంబం నేత్రదానం చేసి మానవత్వాన్ని చాటుకుంది.చంద్రమౌళి కుమారుడు వెగ్గిలం మనోజ్ తేజ్, బంధువు అంజని కుమార్ సహకారంతో నేత్రదానం నిర్ణయం తీసుకోగా, ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వైద్య బృందం నేత్ర సేకరణ ప్రక్రియను పూర్తి చేసింది. ఆయన దానం చేసిన కళ్లతో ఇద్దరు దృష్టి లోపం ఉన్నవారికి కొత్త చూపు లభించింది.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు కుటుంబాన్ని పరామర్శించి, వారి ఉదారతను అభినందించారు. నేత్రదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని, ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాయడం శివకాంత్, కార్యదర్శి బట్టు వినోద్, కోశాధికారి మేతుకు కృష్ణ చైతన్య, ముక్క శరత్ కృష్ణ, గజ్జుల సతీష్ కుమార్, ఐ హాస్పిటల్ ట్రస్టీ కోల అన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలని టీఎస్‌జిఆర్ఈఏ డిమాండ్

కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వెంటనే ఎన్ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎస్‌జిఆర్ఈఏ) కరీంనగర్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. పెన్షనర్స్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ తీర్మానం చేశారు. ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జి.వి. మనోహర్ కుమార్ మాట్లాడుతూ, ప్రతినెల 1.5% ప్రీమియం కట్ చేస్తున్నప్పటికీ హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు.అలాగే జీడీఏ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ నివేదికను వేగవంతం చేసి ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.సమావేశంలో పోలాస రామచంద్రం, శంకరస్వామి, కర్ర రాజిరెడ్డి, రమణయ్య, రాజిరెడ్డి, వీరస్వామి, ఖాజా షంషుద్దీన్, వెంకటరమణ, శ్రీధర్ రావు, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలు ఉపసంహరించాలి

మానకొండూర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.బుధవారం మానకొండూర్ మండలంలో ఉపాధి కూలీలు హరితహారం కార్యక్రమంలో చెట్లు నాటుతున్న ప్రదేశాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ, కొత్త నిబంధనలు, ముఖ్యంగా ఫోటో క్యాప్చర్ విధానం కూలీలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ఐరిస్ సమస్యల కారణంగా వేతనాలు అందకపోవడం దారుణమని అన్నారు.కేంద్రం నిధులను తగ్గించి రాష్ట్రాలపై భారాన్ని మోపడం గ్రామీణ పేదల జీవనాధారానికి దెబ్బతీసే చర్య అని విమర్శించారు. కనీస కూలి రూ.600 ఇవ్వాలని, ప్రతి కూలికి 200 రోజులు పనులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కమ్యూనిటీ పోలీసు ప్రోగ్రాంలో పాల్గొన్న ఏసీపీ విజయకుమార్

గన్నేరువరం, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గన్నేరువరం గ్రామంలో కమ్యూనిటీ పోలీసు ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ డివిజన్ ఏసీపీ విజయకుమార్, ఎస్సై జి. నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.ప్రజలకు సైబర్ క్రైమ్ నేరాల గురించి అవగాహన కల్పిస్తూ, కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరువాత ఏసీపీ విజయకుమార్ ఇటీవల జరిగిన ఎస్సీ/ఎస్టీ కేసు విచారణలో కూడా పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహణ

గన్నేరువరం, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గన్నేరువరం మండలం జంగపెల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాంకాళి ప్రభాకర్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడతాయని తెలిపారు. ప్రతి బిడ్డకు తల్లిపాలు అంటీబాడీలుగా ఉపయోగపడతాయని అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కార్యదర్శి శ్రీకాంత్, అంగన్వాడి టీచర్లు సరోజన, రజిత, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గర్భిణీ స్త్రీలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువుల విక్రయం

హుస్నాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రైతులకు ఎరువుల విక్రయ విధానంలో మార్పులు అమలులోకి వస్తున్నాయని మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ తెలిపారు.ఆగస్టు 6 నుంచి యూరియా, డీఏపీ, ఎన్‌పీకే కాంప్లెక్స్, ఎంఓపీ తదితర ఎరువులు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా మాత్రమే విక్రయించబడతాయి. రైతులు ప్లే స్టోర్ నుండి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఫార్మర్ ఐడి లేదా ఆధార్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ తప్పనిసరిగా పనిచేయాలి. భూమి, పంట, అవసరమైన ఎరువుల వివరాలను యాప్‌లో నమోదు చేసిన తర్వాత క్యూఆర్ కోడ్ టోకెన్ జారీ అవుతుంది. ఆ కోడ్‌ను ఎరువుల డీలర్ వద్ద చూపించి రైతులు ఎరువులు పొందవచ్చు.రైతులు ముందుగానే ఆధార్, మొబైల్ నంబర్, భూమి, పంట వివరాలను సిద్ధం చేసుకుని సమీప ఎరువుల విక్రయ కేంద్రం లేదా వ్యవసాయ శాఖ సిబ్బంది సహాయంతో నమోదు చేసుకోవాలని సూచించారు.

రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు జరపాలని టీఆర్ఎస్ డిమాండ్

కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): చిన్న రైస్ మిల్లులపై మాత్రమే కేసులు పెట్టి, పెద్ద మిల్లర్లను వదిలేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ విమర్శించారు.జిల్లా వ్యాప్తంగా సియంఆర్ బియ్యం అక్రమాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పెద్ద మిల్లర్లను కాపాడుతూ, చిన్న మిల్లర్లపై కక్షసాధింపు చర్యలు తీసుకుంటున్నారని ఆయన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. సివిల్ సప్లయ్ వ్యవస్థలో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.ఏసీకే బకాయిలు చెల్లించని మిల్లర్లకు మళ్లీ ధాన్యం కట్టబెట్టడం, బ్యాంకు గ్యారంటీ నిబంధనలను పక్కన పెట్టడం వెనుక భారీ కుట్ర ఉందని ఆయన అన్నారు. కొందరు మిల్లర్ల వద్ద స్టాక్ లేకపోయినా ఉన్నట్లు చూపించి పెనాల్టీ తప్పించుకుంటున్నారని, దీనిపై ఆధారాలతో త్వరలోనే పిర్యాదు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి, జిల్లా నాయకులు రంగరవేణి లక్ష్మణ్, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, గర్షకుర్తి విద్యాసాగర్,
నూతి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు

హుస్నాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ సదానందం విద్యా ర్థులకు ఆన్‌లైన్ లోన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఫిషింగ్ వంటి సైబర్ నేరాలపై వీడియో క్లిప్‌ల ద్వారా అవగాహన కల్పించారు. సురక్షితమైన ఆన్‌లైన్ విని యో గంపై సూచనలు ఇచ్చి, విద్యార్థులతో సైబర్ భద్రత ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో సీఐ శ్రీ ధర్, ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్సై దివ్య,
కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పైప్ లీకేజీ మరమ్మతులు

సుల్తానాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సుల్తానాబాద్ పట్టణంలో రోడ్డు విస్తరణ, అమృత్ పథకం కింద కొత్త పైప్‌లైన్ పనుల సమయంలో గట్టేపల్లి మంచినీటి పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో నీటి సరఫరాకు అంత రాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ, కమిషనర్ టి. రమేష్ ఘటనాస్థలికి చేరుకుని మరమ్మతు పనులను పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన లీకేజీ మరవ మ్మతులు పూర్తి చేయగా, రేపటి నుంచి పట్టణానికి యథావిధిగా నీటి సరఫరా అందిస్తామని అధికారులు తెలిపారు .అదేవిధంగా, శివాలయం సమీపంలో వాహనాల వేగం కారణంగా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆదేశాల మేరకు ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, కౌన్సిలర్లు గాజుల రాయమల్లయ్య, ఊట్ల వరప్రదీప్, సిద్ధ తిరుపతి, తొర్రికొండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఓపీ, ప్రసూతి విభాగం, ల్యాబ్, ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది స్పందనపై ఆరా తీశారు. వైద్యులు సమయపాలన పాటించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించి ఓపీ సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డుల్లో పరిశుభ్రతను ఎల్లప్పుడూ పాటించాలని, గర్భిణీల నమోదు నుంచి ప్రసవం వరకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ల్యాబ్ సేవలు సక్రమంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులతో మర్యాదగా వ్యవహరిస్తూ సేవాభావంతో పనిచేయాలని వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు.తనిఖీ సందర్భంగా సంబంధిత వైద్యులు, ఆసుపత్రి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు

ఖానాపూర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ మండలంలోని సత్తెనపల్లి గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా బోనాలు నిర్వహించారు.బాలికలు కొత్త దుస్తులు ధరించి బోనాలను అలంకరించి గ్రామ ప్రధాన రహదారిలో ఊరేగింపుగా తీసుకెళ్లి పోచమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ సందర్భంగా పిల్లల నృత్యాలు, డాన్సులు గ్రామ ప్రజలను ఆకట్టుకున్నాయి.ప్రజల టీ మమత మాట్లాడుతూ, బోనాల పండుగను పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషకరమని, పిల్లలు భక్తి, క్రమశిక్షణతో పాటు విద్యాభ్యాసంలోనూ ముందుకు సాగాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు భీమలింగం మాట్లాడుతూ, పిల్లలు సృజనాత్మకతతో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా కార్యక్రమాన్ని నిర్వహించారని తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మమత, జాద భీమలింగం, ఉపాధ్యాయులు వి. కవిత, ఎస్. గీతారాణి, డి. సుజాత, కే. మౌనిక, అంగన్వాడీ కార్యకర్త దేవిక, గ్రామ సర్పంచ్ శీర్ల విజయకుమార్, ఉప సర్పంచ్ లక్ష్మణ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పిల్లల భక్తి, సృజనాత్మకతతో బోనాల ఉత్సవం విజయవంతమైంది.

25వ రోజుకు చేరిన విద్యుత్ ఉద్యోగుల నిరసన

కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాలను ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగుల నిరసన 25వ రోజుకు చేరింది.కరీంనగర్ సూపరింటెం డింగ్ ఇంజనీర్ కార్యాలయం ఆవరణలో టీజీపీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 40 రోజులుగా నిరసనలు కొనసాగుతున్నప్పటికీ మేనేజ్‌మెంట్ టెండర్లను రద్దు చేయకపోవడం దురదృష్టకరమని, మొండి వైఖరి కొనసాగితే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణారావు, మహేందర్ రావు, శ్రీనివాస్, రఘు, రమేష్, పవన్ కుమార్, సంతోష్, యుగంధర్, రాచకొండ శ్రీనివాస్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.టీజీ ట్రాన్స్కో కార్యాలయ ఆవరణలో కూడా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ప్రైవేటుపరంపై పోరాటం మరింత ఉధృతం కానుందని ఉద్యోగులు హెచ్చరించారు.

కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగరంలోని కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. మేయర్ సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారో గ్యాలతో ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, కళాకారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉత్సవాల్లో సంప్రదాయ డప్పు వాయిద్యాలు, భక్తి గీతాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన కమిటీ సభ్యులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, మున్సిపల్ సిబ్బందిని మేయర్ అభినందించారు.కార్యక్రమంలో కళాకారులు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో సాగిన బోనాల ఉత్సవాలు విజయవంతంగా
ముగిశాయి.

మండల సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఖానాపూర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు.గ్రామాల్లోని సమస్యలను సర్పంచుల ద్వారా తెలుసుకుని వెంటనే పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్, రహదారులు, వ్యవసాయం, వైద్యం, తాగునీరు వంటి అంశాలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. గ్రామాభివృద్ధికి జలసిరి ద్వారా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి, సర్పంచులు అధికారులతో సమన్వయంతో పనులు పూర్తి చేయాలని సూచించారు. అంగన్వాడీ నియామకాల్లో నియమావళి పాటించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వీధి దీపాలు, శానిటేషన్ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో తహసిల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

క్షుద్ర పూజలంటూ కాంగ్రెస్ క్షుద్ర రాజకీయాలు మానుకోవాలి బిఆర్ఎస్ నాయకుడు బచ్చు రామకృష్ణ

ములుగూడ, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మాజీ మంత్రి, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావుపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు చిల్లర రాజకీయాలకే నిదర్శనమని రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ మండి పడ్డారు.బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “రాష్ట్రంలో సాగునీరు లేక రైతాంగం ఇబ్బందులు పడుతుంటే, గోదావరి నీటిని పంపుల ద్వారా ఎత్తిపోసేలా డిమాండ్ చేసిన బిఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు కక్షపూరితంగా క్షుద్ర పూజల ఆరోపణలు చేయడం వారి పరిపాలన వైఫల్యానికి అద్దం పడుతోంది” అని అన్నారు.హరీష్ రావు నీటిపారుదల శాఖ మంత్రిగా కెసిఆర్ నాయకత్వంలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించి, రైతులకు నీళ్లు అందించారని గుర్తుచేశారు. “ఇలాంటి ఆరోపణలు సూర్యునిపై ఉమ్మివేసినట్లే. ఆలయ దర్శనాన్ని క్షుద్ర పూజలతో పోల్చడం కాంగ్రెస్ నేతల అజ్ఞానానికి నిదర్శనం” అని వ్యాఖ్యానించారు.“రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక కాంగ్రెస్ నేతలు డ్రామాలు ఆడుతున్నారు. ఆధారాలు లేకుండా వ్యక్తిత్వ హననానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు” అని హెచ్చరించారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ మండల కార్యనిర్వాహక కార్యదర్శి కొలుకులపల్లి యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు రాపోలు యాదగిరి, యువజన నాయకులు బూరుగు నాగరాజు, వంగూరి గిరిబాబు, వార్డు సభ్యులు కొండాపురం నరేష్, యండి గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

హుస్నాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బంక లక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై మోసుకుని ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో సుఖశాంతులు, సమృద్ధిగా వర్షాలు, పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.సర్పంచ్ బంక లక్ష్మి మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి వేడుకలు గ్రామ ఐక్యతను బలోపేతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం గౌరవ అధ్యక్షులు బంక చందు, అధ్యక్షుడు బోనాల కుమార్, ఉపాధ్యక్షులు బంక రాజ్‌కుమార్, శాతవేణి చందు, పోసవేణి ఎల్లయ్య, కార్యవర్గ సభ్యులు పోసవేణి సంపత్, గెంటే అనిల్, బంక కనకయ్య, శాతవేణి శ్రీకాంత్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామదేవత ఆశీస్సులతో తోటపల్లి బోనాలు
విజయవంతంగా
ముగిశాయి.

టిబి ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ఎక్స్‌రే క్యాంపు

పెద్దపల్లి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): టిబి ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హెచ్‌డబ్ల్యుసి పెద్దపల్లి--3లో ఎక్స్‌రే క్యాంపు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మరియు జిల్లా క్షయ నిర్మూలన అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.టీబీ లక్షణాలు ఉన్న వారికి, అనుమానితులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించగా, మొత్తం 102 మందికి టెస్ట్ చేయడం జరిగింది.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్వర్లు, 12వ వార్డు కౌన్సిలర్ దొడ్డుపల్లి జగదీష్, పి.హెచ్.ఎన్ మెరిసి ప్రమోద, ఎం.ఎల్.హెచ్.పి మమత, ఏఎన్ఎం నిర్మల, ఆశా కార్యకర్తలు మమత, పద్మ తదితరులు పాల్గొన్నారు. టీబీ నిర్మూలన లక్ష్యంగా ఈ క్యాంపు విజయవంతంగా నిర్వహించబడింది.

ఘనంగా టెట్ అధ్యయన సామగ్రి ఆవిష్కరణ

ఖానాపూర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): టెట్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయ అభ్యర్థులకు ఉపయోగపడేలా స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్‌టీయూటీఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన టెట్ అధ్యయన సామగ్రిని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న ఆవిష్కరించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన అధ్యయన సామగ్రిని తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని, అభ్యర్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ సంఘాలు తమ హక్కుల సాధనతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి ఉపయోగకరమని అన్నారు. ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన్న యాదవ్ మాట్లాడుతూ, నిపుణులచే రూపొందించిన ఈ అధ్యయన సామగ్రి సిలబస్‌కు అనుగుణంగా, పరీక్షా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించబడిందని, అభ్యర్థులకు విజయానికి మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చొక్కారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగభూషణ్, రాజమహేందర్, శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మఠం పరమేశ్వర్, లక్ష్మీనారాయణ, ఖలీద్ హైమాద్, నాగోరావు, ఎం. చంద్రశేఖర్ రావు, మధుసూదన్, రవిక ుమార్ తదితరులు
పాల్గొన్నారు.

కొత్తచెరువు అలుగుపారడంతో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

కొత్తపల్లి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల గ్రామ శివారు కొత్తచెరువు నిండిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ కార్పొరేషన్ సిడీసీసీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ హాజరై గంగమ్మ తల్లికి పూలభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ, ఎల్లంపల్లి--శ్రీపాద ప్రాజెక్టుల నిర్మాణం కాంగ్రెస్ నాయకుల ముందుచూపుతోనే సాధ్యమైందని, వారి కృషి వల్లే ఈరోజు చెరువులు అలుగుపారుతున్నాయని తెలిపారు. ప్రతిపక్షం కాళేశ్వరం నీళ్లంటూ చేస్తున్న అబద్ధ ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రజా ప్రభుత్వాన్ని గంగమ్మ తల్లి ఆశీర్వదిస్తోందని అన్నారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి గౌడ్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు మడుపు మోహన్, కామరెడ్డి రాంరెడ్డి, తిరుపతి, అమరిశెట్టి కనకయ్య, గుంటూరు మురళి, మల్యాల రాజా గౌడ్, సుంకే రాజగోపాల్, నాంపల్లి రష్మయ్య, బండపల్లి చందు, పెంట శేఖర్, వెన్నం శ్రీనివాస్, కుమ్మరి నాగయ్య, దేవదాస్, శంకర్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుల ముందుచూపుతోనే జిల్లా సస్యశ్యామలం అవుతోందని అంజన్ కుమార్ పేర్కొన్నారు.

జనరల్ న్యూస్

తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ సీడీపీఓ నర్సింగరాణి

రామడుగు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):రామడుగు మండలం వెదిర అంగన్వాడి కేంద్రంలో గ్రామ సర్పంచ్ అంజన్ కుమార్ అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ నర్సింగరాణి మాట్లాడుతూ, శిశువు జన్మించిన గంటలోపే ముర్రుపాలు పట్టించడం అత్యంత అవసరమని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అనంతరం అనుబంధ ఆహారం అందించడంతో పాటు మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపాలని తల్లులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజేశ్వరి పోషకాహారం ప్రాముఖ్యతను వివరించి, తల్లులు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ నర్సింగరాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్ రేణుక, పోషణ అభియాన్ రోమీల, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు సునీత, పద్మ, శ్వేత, విజయ, గౌతమి, వీవోలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ అని ఈ కార్యక్రమంలో స్పష్టం చేశారు.ం

నగర అభివృద్ధిపై కీలక సమీక్ష సమావేశం

కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధి అంశాలపై రేపు (ఆగస్టు 6) హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరగనుంది.ఈ సమావేశంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని, నగర అభివృద్ధికి సంబంధించిన ప్రధాన ప్రతిపాదనలు రాష్ట్ర మంత్రులకు సమర్పించనున్నారు. రహదారుల విస్తరణ, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వరద నివారణ చర్యలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, పట్టణ సుందరీకరణ వంటి అంశాలపై చర్చ జరగనుంది.అదేవిధంగా ప్రత్యేక నిధుల కేటాయింపు, కేంద్ర--రాష్ట్ర పథకాల కింద చేపట్టాల్సిన ప్రాజెక్టులు, ఇప్పటికే కొనసాగుతున్న పనుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై నివేదిక సమర్పించనున్నారు.మేయర్ కార్యాలయం తెలిపిన ప్రకారం, కరీంనగర్ నగరాన్ని ఆధునికంగా, ప్రజలకు అనుకూలంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహించబడుతోంది.నగర అభివృద్ధి వేగవంతం చేయడమే ఈ సమీక్ష ప్రధాన ఉద్దేశం.

మహిళా సాధికారతకు కుట్టు మిషన్ల పంపిణీ

కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రామచంద్రపూర్ కాలనీలో అభయ మహిళా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హాజరై మహిళలకు మిషన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయని పేర్కొన్నారు. అభయ మహిళా సాధికార కేంద్రం మహిళలకు ఉచిత శిక్షణ అందించి, అనంతరం మిషన్లను పంపిణీ చేసింది. మేయర్ కేంద్రం సేవలను అభినందించారు.కార్యక్రమంలో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, నిర్వాహకులు బాలచంద్ర స్వామీజీ, మహిళలు పాల్గొన్నారు. మహిళా సాధికారతకు దోహదపడే ఈ కార్యక్రమం అభినందనీయమని మేయర్ అన్నారు.

ఏడుగురికి కారుణ్య నియామక పత్రాలు అందించిన కలెక్టర్

కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లాలో వివిధ శాఖల్లో కారుణ్య నియామకం కింద ఏడుగురికి ఉద్యోగాలు కల్పించినట్లు కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నియామక పత్రాలను అందజేసిన ఆమె, బాధ్యతగా విధులు నిర్వర్తించి కుటుంబాలకు ఆసరాగా నిలవాలని సూచించారు.కారుణ్య నియామకాల్లో ఐదుగురిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించారు.వినేష్ (పశుసంవర్ధక శాఖ), అభిలాష్ (ట్రెజరీ) ఆఫీస్ సబార్డినేట్లుగా, సుమలత (సీపీఓ ఆఫీస్), వకులాభరణం విష్ణుత (వర్క్ ఓ అకౌంట్స్), రేహ ఫాతిమా (జీజీహెచ్), కొల్ల రాజు, శ్రీలక్ష్మి (కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం) జూనియర్ అసిస్టెంట్లుగా నియమితులయ్యారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి తదితరులు పాల్గొన్నారు.కుటుంబాలకు ఆసరాగా నిలిచేలా కారుణ్య నియామకాలు కల్పించామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ రెవెన్యూ డి. శ్రీనివాస్ రెడ్డి బుధవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వివిప్యాట్ గోదాంలను తనిఖీ చేసి నివేదికలు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. గోదాంలో భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది హాజరు తీరును పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మార్వో రాజేష్, బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతినిధులు మిడిదొడ్డి కపిల్, మహమ్మద్ పహీద్, ఎంఐఎం ప్రతినిధి మజిత్ హుస్సేన్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.ఎన్నికల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సమగ్ర తనిఖీ నిర్వహించారు.

వృద్ధుడి హత్య కేసును చేదించిన పోలీసులు

పెద్దపల్లి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని మడక గ్రామంలో జరిగిన వృద్ధుడి హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి మేకల వేపచెట్టు మాధయ్య (70)ను కిరాతకంగా హత్య చేసిన చిన్న కుమారుడు వేపచెట్టు బాబురావు (36)ను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో రిమాండ్‌కు హాజరుపరచినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. రంజిత్ రావు తెలిపారు.తండ్రి పింఛన్ డబ్బులు వైద్య ఖర్చులకు వినియోగించడంతో మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని కోపంతో బాబురావు పెద్ద రాయితో దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో బయటపడింది.మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని మడక బస్‌స్టాప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఓదెల జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించారు. తండ్రిని హత్య చేసిన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

నర్సాపూర్‌లో చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు టీబీ ముక్త్ గ్రామాల లక్ష్యం

ఎలిగేడు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రతి గ్రామాన్ని టీబీ ముక్త్ గ్రామంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా తెలిపారు. ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిక్షయ్ శివర్ కార్యక్రమంలో భాగంగా ఆమె ఆధ్వర్యంలో చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు.టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా దేశాన్ని టీబీ రహిత భారతంగా మార్చడంలో గ్రామాలే కీలకమని, వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలను హైరిస్క్ గ్రామాలుగా గుర్తించి అక్కడే ఎక్స్‌రే క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని ఆమె వివరించారు. పెద్దపల్లి జిల్లాను టీబీ రహిత జిల్లాగా చేయడానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ తీసుకుని మొబైల్ ఎక్స్‌రే మిషన్లను అందుబాటులోకి తెచ్చారని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పవిత్ర, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, డీపీవోలు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు .గ్రామంలోని 14 ఏళ్లు పైబడిన వారందరూ తప్పనిసరిగా చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నర్సాపూర్‌లో 102 మందికి పరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్, టీబీ ట్రీట్మెంట్ సూపర్వైజర్ వజ్ర సురేందర్, టెక్నీషియన్ పూదరి రాజు, టీబీ ఎంట్రీ ఆపరేటర్ భాజా, డాక్టర్ సింధూర, ఏఎన్ఎం అమృత, ఆశా వర్కర్ స్వరూప, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ చౌకదారుల దుకాణాన్ని ప్రారంభించిన మండలకాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్

-బద్దెల శ్రీనివాస్ యాదవ్.

దేవరకొండ ఆగష్టు 05.(నీలగిరి ఎక్స్ ప్రెస్): నల్గొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి గ్రామంలో ప్రభుత్వ చౌకాదారుల దుకాణం షాప్ నెంబర్ 8 ని డిండి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ (రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు). బద్దెలశ్రీనివాస్ యాదవ్ ,జర్పుల లక్ష్మీ తిరుపతి , షాపు డీలర్ వరిమల్ల మల్లేష్ తో కలిసి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ వర్కాల బాల నారాయణ, ఉప సర్పంచ్ బద్దెల బాల లింగయ్య, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ బి. శశికళ, పాల్గొన్నారు.డీలర్ మల్లేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు నూతన రేషన్ షాపు ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇడికుడి జగదీశ్వర చారి,అంబటి లక్ష్మణ్,గడిగ నాగరాజు, పులిజాల శ్రీనివాస్,బద్దెల పెద్దయ్య ,పెనిమిళ్ల చంద్రమౌళి,ఇడికుడి చంద్రవ మౌళి,నీళా నాగభూషణం, నెంబర్స్ లింగయ్య, పెనిమిళ్లఅనిల్,మాడ్గులకొండల్,బద్దెల చిన్న పాపయ్య,శిగ అర్జున్,ఉలుకుంద క్రిష్ణాజి,ంగదంపల్లి వెంకటయ్య, దొడ్డి ఆంజనేయులు,మద్దెల విక్రమ్,బర్పటి లక్ష్మయ్య,గడ్డంఅనిల్ గ్రామ ప్రజలు
తదితరులు పాల్గొన్నారు .

యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ

దేవరకొండ ఆగష్టు 05.(నీలగిరి ఎక్స్ ప్రెస్) : నల్లగొండ జిల్లా డిండి మండలం కేంద్రంలో గల పిఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల లో యూత్ ఫర్ సేవా ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి సహకారంతో పాఠశాలలో సింగిల్ పేరెంట్స్ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ మరియు స్టేషనరీ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో వేజన్న మరియు యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేందర్ బాబు ,ఇంచార్జీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శ్యాం సుందర్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలగా మన మోడల్ హైస్కూల్, డిండి పాఠశాలలో స్కూల్ బ్యాగ్స్ మరియు ఎన్ ఎం ఎం ఎస్ మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందని ,2025-26 సంవత్సరంలో ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షకి 18 మంది విద్యార్థులు అప్లై చేసుకుంటే ఇద్దరు(2) విద్యార్థులు సెలెక్ట్ అయ్యారు. విద్యార్థులు ఈ విజయాన్ని సాధించడానికి ఉపాధ్యాయుల సపోర్టు మరియు యూత్ ఫర్ సేవా, అరనైజేషన్ హైదరాబాద్ వారి సహకారం ఎంతో ఉపయోగపడింది. సెలెక్ట్ అయిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ యూత్ ఫర్ సేవా బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ శ్యామ్ సుందర్ మరియు ఉపాధ్యాయులు, యూత్ ఫర్ సేవ వాలంటీర్స్ రాఘవ , కడారి శ్రీశైలం, బాల స్వామి , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు

పెద్దపల్లి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను పూర్తిగా గాలికి వదిలేసి ఇసుక, మట్టి మాఫియాలకు అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆరోపించారు.పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు కూడా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ంఅధికారుల నిర్లక్ష్య ధోరణిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పణ

పెద్దపల్లి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జూలపల్లి మండలంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఒడి బియ్యం సమర్పణ, శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

తెలంగాణ ఉద్యమ గాయని తేలు విజయకు ఘన సన్మానం

హుస్నాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ మంజులక్క యువసేన కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ గాయని తేలు విజయ--సుమంత్ దంపతులను కాంగ్రెస్ నాయకురాలు, సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులా రెడ్డి సన్మానించారు.ఈ సందర్భంగా మంజులా రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర అపారమని, వారి కృషి లేని తెలంగాణను ఊహించలేమని అన్నారు. తేలు విజయ సామాజిక పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేసి ఎన్నో ఆటుపోటాలు ఎదుర్కొంటూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో కళాకారులకు సముచిత స్థానం, గౌరవం దక్కాలని, వారిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. కళాకారులకు ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ప్రాంత కళాకారులు గద్ద సంపత్, గొల్లపల్లి వినోద్, బోనగిరి శ్రీకాంత్, పొన్నాల అశోక్, చెక్రీ, మంద మహేందర్, దేవునూరి అశోక్ పాల్గొన్నారు. కళాకారుల కృషి, తెలంగాణ ఉద్యమానికి పునాది అని సన్మాన కార్యక్రమంలో గుర్తు చేశారు.

పోచమ్మ బోనాల పండుగ కరపత్రాల ఆవిష్కరణ

కరీంనగర్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగరంలోని భగత్ నగర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరగనున్న పోచమ్మ తల్లి బోనాల పండుగ కరపత్రాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భగత్ నగర్ మున్నూరు కాపు బాంధవులు ఐకమత్యంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.భగత్ నగర్‌లో బోనాల పండుగ ఆగస్టు 9న జరగనుంది. ఉదయం 10 గంటలకు శోభాయాత్ర ప్రారంభమై, సి డబ్ల్యూ సి గోదాంలోని పోచమ్మ దేవాలయానికి చేరుకుని బోనాలు సమర్పించనున్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం బాధ్యులు మెంగనీ వెంకన్న, తోట వెంకట రాములు, రుద్ర ఆంజనేయులు, గంప ముండయ్య, వంగ సుధాకర్, కర్ర సత్యం, పెంట వీరయ్య, బరిగల తిరుపతి, వాసాల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.భక్తిశ్రద్ధలతో జరగనున్న ఈ బోనాల పండుగకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

మున్సిపాలిటీ అక్రమాలపై బీజేపీ ఆగ్రహం

హుజూరాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు.బుధవారం జరిగిన బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ కౌన్సిలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిజమైన నిరుపేదలు, అర్హులైన లబ్ధిదారులను పక్కనబెట్టి, కాంగ్రెస్ విధేయులకే ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. మున్సిపాలిటీ పాలన అవినీతికి అడ్డాగా మారిందని మండిపడ్డారు.పేదల హక్కులను కాలరాస్తూ అనర్హులకు ఇళ్లు కేటాయించడం అంగీకారయోగ్యం కాదని, బాధితులకు మద్దతుగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇండ్లు వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల విజయ, పట్టణ అధ్యక్షుడు తుర్పాటి రాజు, కౌన్సిలర్లు కొలుగురి సుమలత, దామెర అనూష, పంజాల మనోజ్, కొండ ప్రశాంతి, మంచి కట్ల మురళి, దామర అనురాగ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.అర్హులైన పేదలకు ఇండ్లు అందే వరకు పోరాటం ఆపేదిలేదని బీజేపీ ప్రకటించింది.

సరంపేటలో జల మహోత్సవం

మర్రిగూడ, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో జల మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ నక్క రాములమ్మ రవి మాట్లాడుతూ, “భవిష్యత్ తరాల కోసం నీటిని పొదుపుగా వాడాలి. ప్రతి ఇంట ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి” అని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ ప్రజలతో జల సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రభాకర్, వార్డు సభ్యులు నక్క యాదయ్య, నక్క వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నర్సాపూర్, దూళికట్టలో తల్లిపాల వారోత్సవాలు

ఎలిగేడు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):“తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష” అని నర్సాపూర్ సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్ గౌడ్, దూళికట్ట సర్పంచ్ కొమురయ్య పేర్కొన్నారు.ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ గ్రామ అంగన్వాడి--2, దూళికట్ట అంగన్వాడి కేంద్రం--03లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి, తల్లులు, గర్భిణీలు, చిన్నారులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అజ్మీర జ్యోతి, లలిత, అంగన్వాడి టీచర్లు ప్రభావతి, భారతి, వెంకటమ్మ, రజిత, సూర్యకళ, హేమలత పాల్గొన్నారు. గ్రామస్తులు, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు ఉత్సాహంగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించారు.

ఎలిగేడు లో మహిళా గ్రామసభ

ఎలిగేడు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ఎలిగేడు గ్రామంలో బుధవారం మహిళా గ్రామసభను సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, “మహిళలు విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక రంగాలతో పాటు అన్ని రంగాల్లో సాధికారత సాధించి అభివృద్ధిలో ముందుండాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలి” అని పిలుపునిచ్చారు.గ్రామసభలో ఉప సర్పంచ్ ముంజం నరేష్ కుమార్, కార్యదర్శి అంజలి, అంగన్వాడి టీచర్లు, మహిళా గ్రూప్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మహిళల సాధికారతపై చర్చలు జరిగి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

జీవితాన్ని మార్చే శక్తి చదువుకే ఉంది కేఎల్ఆర్

కేశంపేట, జూలై 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) మాట్లాడుతూ, “నేటి తరానికి నైపుణ్య శిక్షణతో పాటు విలువలతో కూడిన విద్య అవసరం. ప్రపంచ గమనాన్ని, జీవితాన్ని ఉన్నత స్థితికి మార్చే శక్తి చదువులోనే ఉంది” అని పేర్కొన్నారు.కేశంపేట మండలం పాటిగడ్డ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, జూనియర్ కాలేజీ (కేజీబీవీ)లో కేఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్య శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, వారికి పలు సూచనలు చేశారు.“యువత బంగారు భవిష్యత్తు చదువుపైనే ఆధారపడి ఉంది. ఒక్కరోజు కూడా వృథా చేయకుండా, టీచర్లు చెప్పిన పాఠాలను అదే రోజు మననం చేసుకోవాలి. చదువుతోనే వ్యక్తి జీవితాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లవచ్చు” అని కేఎల్ఆర్ విద్యార్థులకు సందేశమిచ్చారు.

వెల్జల్ సెక్టార్‌లో ఘనంగా తల్లిపాల వార్షికోత్సవాలు

తలకొండపల్లి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జల్ సెక్టార్ అంగనవాడి--3లో పోషక అభియాన్‌లో భాగంగా తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి.సూపర్వైజర్ తిరుమల మాట్లాడుతూ, “పుట్టిన తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యంత ముఖ్యమైనది. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారం, రోగనిరోధక శక్తికి పునాది” అని సూచించారు.అంగనవాడి టీచర్ టి. వసంతలక్ష్మి మాట్లాడుతూ, “తల్లిపాలు శిశు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదం చేస్తాయి” అని వివరించారు. అంగనవాడి టీచర్ నస్రీన్ బేగం మాట్లాడుతూ, “తల్లిపాలు పోషకాహార లోపం, శిశు మరణాల నివారణలో కీలకం. గ్రామాల్లో అంగనవాడి కేంద్రాల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, తల్లిపాలపై ఉన్న అపోహలను శాస్త్రీయంగా నివృత్తి చేయాలి” అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ, ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి, గ్రామ పంచాయతీ కార్య దర్శి వజీద్, ఏఎన్ఎంలు సువర్ణ, సుజాత, లక్ష్మీదేవి, ఆశా వర్కర్లు కవిత, సరస్వతి, నాయకులు వెంకటేష్, శివ విజయ్ కుమార్, వార్డు సభ్యులు డి. శ్రీశైలం, డి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభించిన సర్పంచ్

మాడుగుల, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మాడుగుల మండలంలోని కుబ్య తండా గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన నూతన హైమాస్ట్ లైట్ ప్రారంభోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది.గ్రామ ప్రజలు, నాయకుల సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్విచ్ ఆన్ చేసి హైమాస్ట్ లైట్‌ను స్థానిక సర్పంచ్ దేవి--దేవరాజ్ నాయక్ ప్రారంభించారు. “తండా అభివృద్ధికి, రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా వెలుగులు అందించడానికి ఈ లైట్‌ను ఏర్పాటు చేశాం” అని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాష నాయక్, 1వ వార్డు సభ్యుడు శ్రీనివాస్, యువ నాయకుడు అనిల్, మాజీ ఉప సర్పంచ్ కుబ్య నాయక్, గ్రామ పెద్దలు చంద్య నాయక్, దౌరు నాయక్, రూప్ల నాయక్, రమేష్, అమర్‌సింగ్, పాండు, బాబురామ్, రవి తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ మరియు పాలకవర్గానికి శాలువాలతో సత్కారం చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఉపాధ్యాయ సమస్యల పై పోరాటానికి టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి పిలుపు

వేలేరు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):వేలేరు మండలంలోని మలిలికుదుర్ల, పీచర, శాలపల్లి, షోడసపల్లి, గొల్లకిష్టపల్లి, మద్దెలగూడెం గ్రామాల్లో ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించిన టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు దాటినా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలులోకి రాలేదని ఆయన వాపోయారు. వెంటనే పీఆర్సీ ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు, ఉపాధ్యాయుల బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలని, కొత్త ఆరోగ్య పథకం మార్గదర్శకాలను విడుదల చేసి ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని ఆయన కోరారు.ఎన్నికల సందర్భంగా

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని ఆయన స్పష్టం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించి వారిని రెగ్యులరైజ్ చేయాలని, జీవో 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ బదుల మూసివేత ఆలోచనలను విరమించుకోవాలని ఆయన హెచ్చరించారు.

ఈ సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాట కార్యక్రమాన్ని ప్రకటించారు. ఆగస్టు 7న పాఠశాలల్లో నిరసనలు, ఆగస్టు 12, 13న మండల కేంద్రాల్లో మెమోరాండంలు, ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 29న ఇందిరా పార్క్‌లో మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ స్పందన లేకుంటే సెప్టెంబరులో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశాల్లో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యం.డి. సత్తార్, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పాఠశాల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల కొత్త ఎజెండా.. ఆ లింక్స్ క్లిక్ చేస్తే జేబులు ఖాళీ!

యాచారం ,ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్) : రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలను నియంత్రించడంలో కానీ, వాటిని అరికట్టడంలో కానీ విద్యార్థులు సైబర్ అంబాసిడర్లు కావాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ ఇన్‌స్పెక్టర్ బి. సత్యనారాయణ అన్నారు. సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ ఇన్‌స్పెక్టర్ బి. సత్యనారాయణ మాట్లాడుతూ... సైబర్ కేటుగాళ్లు ప్రధానంగా టెక్నాలజీ, సైకాలజీని బేస్ గా చేసుకొని ఈ నేరాలకు పాల్పడుతుంటారని వివరించారు. ఇకపోతే ముఖ్యంగా భయం, ప్రేమ, అత్యాశ ఈ మూడు అంశాలను వారి ప్రధాన ఎజెండాగా మార్చుకొని సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను టార్గెట్ చేస్తూ మోసాలు చేస్తున్నారని తెలిపారు. అధికారులు విద్యార్థులకు ఆన్‌లైన్

మోసాలు, ఫిషింగ్ లింకులు, ఓటీపీ మోసాలు, క్యూఆర్ కోడ్ మోసాలు, సోషల్ మీడియా భద్రత, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం, వ్యక్తిగత సమాచారం గోప్యత, డిజిటల్ అరెస్ట్ వంటి కొత్త తరహా సైబర్ మోసాల గురించి వివరించారు. అలాగే అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని, ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి నెల మొదటి బుధవారం సైబర్ జాగృతి దివస్ నిర్వహించడం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం లక్ష్యమని తెలిపారు. ఎస్.ఐ. సునీల్ కుమార్ , మరియు సిబ్బంది సైదులు మాట్లాడుతూ...సైబర్ మోసం చాప కింద నీరుల రోజు రోజుకి విస్తరిస్తున్న నేపథ్యంలో వాటిని అరికట్టడం అంత తక్కువ సిబ్బందితో సాధ్యం కాదని చెప్పారు. అందుకే ప్రతి ఒక్క విద్యార్థి ఒక సైబర్ అంబాసిడర్ గా మారి ఈ మోసాలను అరికట్టడంలో భాగస్వాములు కావాలని వారు విద్యార్థులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఉపాధ్యాయుల పాల్గొన్నారు .

గంగారం గ్రామంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

మహేశ్వరం, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):“తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష” అని గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 1 నుండి 7 వరకు జరుపుకునే తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మహేశ్వరం మండలం గంగారం గ్రామపంచాయతీ అంగనవాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సంవత్సరం థీమ్ “తల్లిపాలతో ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు”. కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత, నవజాత శిశువుకు రోగనిరోధక శక్తి, దీర్ఘకాలిక ఆరోగ్యంపై విస్తృత అవగాహన కల్పించారు. “అమ్మ పాలు అమృతం” అని నిపుణులు పేర్కొంటూ, పుట్టిన మొదటి గంటలో తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశు మరణాలను 22 శాతం వరకు తగ్గించవచ్చని వివరించారు. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు, ఆ తర్వాత రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు.కుటుంబ భాగస్వామ్యం తల్లిపాల ప్రోత్సాహానికి కీలకమని, భర్త, అత్తమామల సహకారం అవసరమని వివరించారు. పని ప్రదేశాల్లో పనిచేసే తల్లులకు బ్రెస్ట్ ఫీడింగ్ కార్నర్లు, క్రెచ్ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అంగనవాడీ మండల సూపర్వైజర్ విద్యావతి మాట్లాడుతూ, “తల్లిపాలు కేవలం ఆహారం కాదు, అది శిశువుకు మొదటి టీకా. ఇన్ఫెక్షన్లు, డయేరియా, న్యుమోనియా వంటి

వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుంది. తల్లికి రొమ్ము క్యాన్సర్, మధుమేహం వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది” అని తెలిపారు.గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ, “ఆరోగ్యకరమైన సమాజానికి ఆరోగ్యకరమైన పిల్లలు అవసరం. అందుకు తల్లిపాలే పునాది. ప్రతి గర్భిణి, బాలింతకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం” అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు ఎం. మోహన్, ఎం. రవి, ఎం. శ్రీనివాస్, ఎం. భాస్కర్, అంగనవాడీ టీచర్ అనిత, స్కూల్ టీచర్ సురేష్, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఇంటింటికి అవగాహన ర్యాలీలు, పోస్టర్ల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అర్హులైన రైతులకు భూ భారతి ద్వారా పట్టాలు అందజేస్తాం

-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.

దేవరకొండ ఆగష్టు 05.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :దేవరకొండ నియోజకవర్గం, చందంపేట మండలంలోని చీత్రియాల, పెద్దమూల, నల్లచెలమూల, బుడ్డోని తండా, కాకునూటి తండా గ్రామాల ప్రజలతో నిర్వహించిన సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పలు కీలక హామీలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థలో ఏర్పడిన లోపాల కారణంగా అనేక మంది నిజమైన రైతుల భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం, పట్టాలు లేకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. దీంతో అర్హులైన రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి కార్యక్రమం ద్వారా నిజమైన అర్హులైన రైతుల భూములకు సమగ్ర సర్వే నిర్వహించి, నిబంధనల ప్రకారం పట్టాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే

హామీ ఇచ్చారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని స్పష్టం చేశారు.అదేవిధంగా, నాగార్జునసాగర్ నుండి గాజుబేడా లిఫ్ట్ ద్వారా ఈ గ్రామాల రైతులకు సాగునీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయానికి నీటి కొరత లేకుండా అధికారులు, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

అలాగే, పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, చీత్రియాల మాజీ సర్పంచ్ రంగయ్య, బుడ్డోనితండా మాజీ సర్పంచ్ బాలు నాయక్, మున్నయ్య, వెంకటయ్య, నాగేష్, లక్ష్మయ్య, వెంకటయ్య, లింగాల పెంటయ్య, ముత్యామయ్య, ఉప సర్పంచ్ తుల్చా, భర్మా, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెన్షన్ కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వృద్ధురాలు

-అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం.

దేవరకొండ ఆగష్టు 05.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :నల్లగొండ జిల్లా, చందంపేట మండలం, పోల్య నాయక్ తండకు చెందిన మాజీ వార్డు సభ్యురాలు రామావత్ గూగాని భర్త రామావత్ జోగ్య బుధవారం ఉదయం పెన్షన్ తీసుకునేందుకు మూడుదండ్ల గ్రామానికి వెళ్లగా, అక్కడ అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందారు.

గ్రామస్తుల కథనం ప్రకారం, తండాలోనే పెన్షన్ పంపిణీ చేయాలని పలుమార్లు అధికారులను కోరినా స్పందన లేకపోవడంతో వృద్ధులు సమీప గ్రామానికి మూడుదండ్ల వెళ్లాల్సి వస్తోంది. ఈ నిర్లక్ష్యమే ఒక వృద్ధులప్రాణాన్ని బలితీసుకుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా, పోస్ట్‌మ్యాన్‌పై కూడా గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. దూర ప్రాంతాలకు హైదరాబాద్ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసే సిబ్బంది, పోల్య నాయక్ తండా నుండి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి మాత్రం రావడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే, కొంతమంది లబ్ధిదారుల నుంచి కమిషన్ తీసుకున్న తర్వాతే పెన్షన్ అందిస్తున్నారనే ఆరోపణలు కూడా గ్రామస్తులు చేస్తున్నారు.అలాగే, పెన్షన్ పంపిణీ సమయంలో ప్రభుత్వం అందించే అదనపు ?16 మొత్తాన్ని కూడా లబ్ధిదారుల నుంచి తీసుకుంటున్నారని, ప్రశ్నించిన వారికి ప్రతినెల ఇదే పరిస్థితి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి నెలల తరబడి తిప్పిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం, పోస్టల్ శాఖ సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికి తీసి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పెన్షన్ కోసం తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రతి గ్రామంలోనే సకాలంలో పెన్షన్ అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సైబర్ క్రైమ్ పై విద్యార్థులకు అవగాహన

దేవరకొండ ఆగష్టు 05. (నీలగిరి ఎక్స్ ప్రెస్) :డిండి మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో సైబర్ జాగరూకత దివాస్ సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా ఎస్. ఐ.బాలకృష్ణ పాల్గొని ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్ అవగాహన కల్పించారు అలాగే విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని డ్రగ్స్ వలన చాలా ప్రమాదం పొంచి ఉందని, సెల్ ఫోన్ లో నిర్వహించే బెట్టింగులు, ఆన్లైన్ మోసాలను, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం గుర్తుతెలియని వ్యక్తులకు పంచకూడదని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి, అధ్యాపకులు పాండురంగయ్య, కృష్ణయ్య, సంతోష్ కుమార్, ఆంజనేయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 10న జైల్ బరో విజయవంతం చేయాలని పిలుపు

కల్వకుర్తి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తోందని ఆరోపిస్తూ, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్ బరో కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, తర్కికల్ గ్రామ కన్వీనర్ మహేష్ తెలిపారు.వారు మాట్లాడుతూ, “నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులకు నష్టం కలిగించేలా ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుకునేందుకు యాజమాన్యాలకు స్వేచ్ఛ ఇచ్చారు. సమ్మె హక్కును కాలరాసి, కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్‌ను కష్టతరం చేశారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయింది” అని విమర్శించారు.అలాగే, “మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ – రోజ్‌గార్ ఆజీవిక మిషన్ (గ్రామీణ) చట్టం తీసుకొచ్చి ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచారు. రైతులకు నష్టం కలిగించేలా నూతన విద్యుత్ చట్టం, విత్తన సవరణ చట్టం తీసుకొచ్చారు. దీనివల్ల రైతులకే కాక వినియోగదారులకు కూడా నష్టం కలుగుతోంది” అని పేర్కొన్నారు.ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిఐటియు సభ్యులు వెంకటేష్, మల్లేష్, కృష్ణమ్మ, మంజుల, రేణుక, పార్వతమ్మ, అనసూయ పాల్గొన్నారు.

ఆగస్టు 10న జైల్ బరో జయప్రదం చేయాలని పట్టణ సదస్సులో వక్తల పిలుపు

నల్లగొండ, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న జరగనున్న జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు దండెంపల్లి సరోజ పిలుపునిచ్చారు.బుధవారం సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ఎం.వి.ఎన్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన పట్టణ సదస్సులో వారు మాట్లాడుతూ, “బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తోంది. ఎన్నో పోరాట యోధులు ప్రాణత్యాగాలతో సాధించిన స్వాతంత్ర్యాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్మికులు, రైతులు, ప్రజలు ప్రజాస్వామ్యవాదులు పోరాడి దేశాన్ని కాపాడుకోవాలి” అని పిలుపునిచ్చారు.వారు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 10న నల్లగొండ పట్టణంలో జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ ఉపాధ్యక్షులు గౌరీదేవి, మధుసూదన్, సిఐటియు మండల కన్వీనర్ పోలె సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, సలపరాజు సైదులు, జంజరాల శ్రీనివాస్, గంజి రాజేష్, సిహెచ్. అనురాధ, సాగర్ల మల్లయ్య, దాసరి లక్ష్మమ్మ, శ్రావణ్ కుమార్, మిర్యాల శ్రీవాణి, భీమనపల్లి శంకర్, పనస చంద్రయ్య, దండెంపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

టెట్ అభ్యర్థులకు ఉపయోగకరమైన ఎస్టీయూ మెటీరియల్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):టెట్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో పాటు టెట్ అర్హత సాధించని ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రూపొందించిన టెట్ మెటీరియల్ ఎంతో ఉపయోగకరమని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ అన్నారు.జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ, “నాణ్యమైన విద్య అందించాలంటే ఉపాధ్యాయులు నిరంతరం తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. టెట్ సిలబస్‌కు అనుగుణంగా రూపొందించిన ఈ మెటీరియల్ ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపు, విద్యా ప్రమాణాల అభివృద్ధికి దోహదం చేస్తుంది” అని పేర్కొన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, “ఉపాధ్యాయుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిపుణులచే ఈ మెటీరియల్ రూపొందించాం. టెట్ పరీక్షకు అవసరమైన ముఖ్య అంశాలను సమగ్రంగా పొందుపరిచాం. ఆర్థికంగా ఇబ్బంది లేకుండా తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకొచ్చాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శులు అనిల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కే. రమేష్, ప్రభాకర్, నాగర్‌కర్నూల్ మండల శాఖ అధ్యక్షుడు బాలస్వామి, తాడూర్ మండల శాఖ అధ్యక్షుడు సురేష్ బాబు, సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లగొండలో అండర్-16 క్రికెట్ లీగ్ మ్యాచ్‌లను ప్రారంభించిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్):నల్లగొండలో అండర్-16 క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు బుధవారం మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు యువ క్రికెటర్లలో ప్రతిభను వెలికితీసి, రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఈ లీగ్‌ను నిర్వహిస్తున్నారు.మ్యాచ్‌ల ప్రారంభ కార్యక్రమానికి జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు, క్రీడా ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సయ్యద్ అమీనుద్దీన్, డీకేఎస్‌వో అక్బర్, అసోసియేషన్ సభ్యుడు షఫీయుద్దీన్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అండర్-16 లీగ్‌లో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్-16 రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ఇటువంటి లీగ్ పోటీలు ఎంతో దోహదపడతాయని, యువ ఆటగాళ్లకు ఇవి మంచి వేదికగా నిలుస్తాయని క్రీడా సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు ‘ట్యాన్డెమ్’ ఆవిష్కరణ

కల్వకుర్తి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండటంతో రైతులు పంట నష్టపోకుండా ఉండేందుకు ప్రముఖ వ్యవసాయ రసాయనాల సంస్థ ఆల్బా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ముందుకు వచ్చింది.కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామంలోని రైతు వేదికలో గురువారం ‘ట్యాన్డెమ్’ అనే వినూత్న ఉత్పత్తిని ఘనంగా ఆవిష్కరించారు. ఈ మందు పంటలను తెగుళ్ల నుంచి రక్షించడమే కాకుండా, ఆరోగ్యకరమైన పెరుగుదలతో అధిక దిగుబడి వచ్చేలా తోడ్పడుతుందని కంపెనీ ప్రతినిధులు వివరించారు.ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రెసిడెంట్ క్రిస్టిన్ హు, ఇండియా సేల్స్ మేనేజర్ దనేష్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ గోపేష్ పంత్, సౌత్ సేల్స్ మేనేజర్ మంగపతి రావు, తెలంగాణ సేల్స్ మేనేజర్ ప్రసన్న, మహబూబ్‌నగర్ సేల్స్ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, కంపెనీ ప్రతినిధి జయంత్ కుమార్, తోటపల్లి కిసాన్ ట్రేడర్స్ ఎండి ఏజాష్ పాషా పాల్గొన్నారు.నిపుణులు రైతులకు పంట రక్షణ, దిగుబడి పెంపుపై కీలక సూచనలు చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో తెగుళ్ల సమస్యను ఎదుర్కొనేందుకు ‘ట్యాన్డెమ్’ సమర్థవంతమైన పరిష్కారమని తెలిపారు.కల్వకుర్తి పరిసర ప్రాంతాల రైతులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మృతురాలి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం

కల్వకుర్తి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కల్వకుర్తి మండలంలోని గుండూర్ గ్రామానికి చెందిన సంపంగి లక్ష్మమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించారు.గ్రామ బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు, సర్పంచ్ అయినేని లక్ష్మమ్మ ద్వారా సమాచారం అందుకున్న వెంటనే ఆయన స్పందించి సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పోతేపల్లి కృష్ణయ్య, పోతుగంటి నాగేంద్రం, శేఖర్, రాజేందర్, సాయిబాబు, సాయి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో జైల్ భరో విజయవంతం చేయాలని పిలుపు

తిప్పర్తి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు ఆగస్టు 10న జరగనున్న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీం పిలుపునిచ్చారు.తిప్పర్తి మండల కేంద్రంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ఎందరో పోరాట యోధుల ప్రాణత్యాగాలతో సాధించిన స్వాతంత్ర్యాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతోంది. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతులు, కార్మికులు, ప్రజలు జైల్ భరోలో పాల్గొని దేశాన్ని కాపాడుకోవాలి” అని పిలుపునిచ్చారు.గత 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం, రైతాంగం, ప్రజల హక్కులను కాలరాస్తోందని ఆయన విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లతో కార్మిక హక్కులను దెబ్బతీసి, విద్యుత్ సవరణ చట్టం, విత్తన చట్టం ద్వారా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్త పథకంతో 30 కోట్ల మంది వ్యవసాయ కార్మికుల జీవనాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు.“దేశానికి అన్నం పెడుతున్న రైతులను, సంపద సృష్టించే కార్మిక వర్గాన్ని మోసం చేస్తూ ప్రజా కంటకంగా మారిన మోడీపై ప్రజలందరూ యుద్ధం ప్రకటించాలి. ఆగస్టు 10న జరిగే జైల్ భరోలో పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి హెచ్చరిక పంపాలి” అని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మన్నెం భిక్షం, సిఐటియు మండల కన్వీనర్ భీమగాని గణేష్, రైతు సంఘం మండల అధ్యక్షులు దొంగరి వెంకన్న, కంది దామోదర్ రెడ్డి, సిఐటియు నాయకురాలు మంత్రాల మంగమ్మ, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి పోకల శశిధర్, ఐద్వా మండల అధ్యక్షురాలు మాలె భార్గవి, నాయకులు మైనం శివప్రసాద్, సంకోజు శరత్, పోకల ఝాన్సీ, భీమగాని విజయలక్ష్మి, వివోఏ మండల నాయకులు ఎం.డి. రూమాన, జక్కలి అనిత, సువర్ణ, సామ్రాజ్యం, సునీత, జయమ్మ, రమణ, సంధ్య, వసుమతి, పుష్ప, జానకమ్మ, కవిత, అన్నపూర్ణ, సైదులు, పరశురాములు, నాగరాజు, వసంత తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో ఖాళీల భర్తీకి వేగం

- రంగారెడ్డి జిల్లాలో 33 పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ..
- ఈనెల 10 వరకు అవకాశం

రంగారెడ్డి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):రంగారెడ్డి జిల్లాలో బస్తీ దవాఖానాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బస్తీ దవాఖానాల్లో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఆధ్వర్యంలో మొత్తం 33 పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ నియామకాలతో పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందనున్నాయని అధికారులు భావిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 13 మెడికల్ ఆఫీసర్లు, 16 స్టాఫ్ నర్సులు, 4 మంది సపోర్టింగ్ సిబ్బందిని నియమించనున్నారు. ఈ నెల 3 నుంచి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుండగా, మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 13 దరఖాస్తులు, స్టాఫ్ నర్స్ పోస్టులకు 400 దరఖాస్తులు అందాయి. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వర్ణకుమారి తెలిపారు. ఎంపికైన వారికి మెడికల్ ఆఫీసర్లకు నెలకు రూ.52,000, స్టాఫ్ నర్సులకు రూ.29,900, సపోర్టింగ్ సిబ్బందికి రూ.15,600 వేతనం చెల్లించనున్నారు. మరోవైపు టీబీ కంట్రోల్ టెక్నీషియన్ 7 పోస్టులకు 212 దరఖాస్తులు, ఎస్ఎల్‌టీసీ 4 పోస్టులకు 20 దరఖాస్తులు అందాయి. ఈ పోస్టుల దరఖాస్తుల స్వీకరణ జూలై 20తో ముగియగా, ప్రస్తుతం పరిశీలన ప్రక్రియకు అధికారులు సిద్ధమవుతున్నారు. బస్తీ దవాఖానాల్లో సిబ్బంది కొరత కారణంగా రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఈ నియామకాలు ఉపశమనం కలిగించనున్నాయి. వైద్య సిబ్బంది అందుబాటులోకి రావడంతో రోగులకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందడంతో పాటు పట్టణ పేదలకు ప్రభుత్వ ఆరోగ్య సేవలు మరింత చేరువ కానున్నాయి.

రైతుల కోసం వైసీపీ శ్రేణుల నిరసనలు

నందికొట్కూరు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్ప్రెస్): పగిడ్యాల మండలం ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి కేసి కెనాల్, హంద్రీనీవాలలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైసీపీ శ్రేణులు చలో ముచ్చుమర్రి కార్యక్రమానికి వెళ్లగా, నందికొట్కూరు రూరల్ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వైసీపీ ఇన్చార్జి డాక్టర్ సుధీర్ ధరను సహా పలువురిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు.దారా సుధీర్ మాట్లాడుతూ, శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం ఉన్నప్పటికీ ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి నీరు విడుదల చేయకపోవడం రైతులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్య అని విమర్శించారు. వేల ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట వర్షాభావంతో ఎండిపోతున్నా ప్రభుత్వం కనికరం చూపకపోవడం దుర్మార్గమని అన్నారు. సీఎం చంద్రబాబు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రైతు సంఘం నాయకుడు భరత్ మాట్లాడుతూ, రైతు సమస్యలపై పోరాడేందుకు వెళ్తున్న వైసీపీ శ్రేణులను అడ్డుకొని కేసులు నమోదు చేయడం దారుణమని, ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడకుండా రైతులకు మేలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. నీరు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బంది సమస్యల పరిష్కారానికై ఎమ్మెల్యే హామీ

అమరాబాద్, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన ఉపాధి హామీ సిబ్బంది, జేఏసీ ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను కలిసి తమ డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. సిబ్బంది విజ్ఞప్తులపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వివరించారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు ఇతర మంత్రులతో కూడా చర్చిస్తానని హామీ ఇచ్చారు.వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి, పాలమూరు ప్రాంతీయ సమావేశంలోనూ చర్చించి, నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఉపాధి హామీ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ

ఎలిగేడు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు మండలంలోని శివపల్లి ప్రాథవిóకోన్నత పాఠశాలలో బుధవారం కీర్తిశేషులు అమ్ముల మొండయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు అమ్ముల సతీష్, అమ్ముల శ్రీనివాస్ చేతులమీదుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన స్టీల్ ప్లేట్లను అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎ. అనిత, ఉపాధ్యాయుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం కుటుంబ సభ్యులు ముందుకు రావడం గ్రామస్థులు అభినందించారు.

బచ్చన్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్

కల్వకుర్తి, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా కల్వకుర్తి పట్టణంలోని బచ్చన్ స్కూల్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ, గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పిడిఎస్యు--ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల ముందు ధర్నా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు సంతోష్ మాట్లాడుతూ, “2014లో యుపిఎస్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరుతో అనుమతి తీసుకున్నారు. అదే భవనంలో 2025లో డిఎస్పి బచ్చన్ స్కూల్ పేరుతో మళ్లీ అనుమతి పొందారు. హైదరాబాద్ యాజమాన్యం పేరుతో తల్లిదండ్రుల వద్ద వేలాది రూపాయలు వసూలు చేస్తూ మోసం చేస్తున్నారు” అని ఆరోపించారు.జిల్లా విద్యాశాఖ అధికారి, స్థానిక ఎంఈఓ వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో విద్యార్థి సంఘం నాయకులు ప్రేమ్ కుమార్, కార్తీక్, రామ్ చరణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాజముద్ర పాస్‌బుక్ పంపిణీ

నందికొట్కూరు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పాములపాడు మండలం మిటకందల గ్రామంలో జరిగిన మీ భూమి -- మీ హక్కు కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య 1366 మంది రైతులకు పట్టాదార పాస్‌బుక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతుకు తన భూమిపై పూర్తి హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు పాస్‌బుక్కులు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. రైతుల భూ హక్కులకు భరోసా కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

టిడిపి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నందికొట్కూరు, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కొత్తపల్లి మండలం వీరాపురం గ్రామంలో రెండేళ్ల ప్రజాపాలన -- సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సేవలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామస్తులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు.కార్యక్రమంలో మండల నాయకులు లింగస్వామి గౌడ్, అబ్జర్వర్ వెంకట శివుడు, క్లస్టర్ ఇంచార్జ్, నారపరెడ్డి కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఆర్టిజిఎస్ సీసీటీవీతో తప్పిపోయిన ఇద్దరు బాలురు గుర్తింపు

నంద్యాల, ఆగస్టు 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నంద్యాల జిల్లాలో తప్పిపోయిన ఇద్దరు బాలురను ఆర్టిజిఎస్ సీసీటీవీ 360 సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పోలీసులు గుర్తించారు.ఆగస్టు 4 రాత్రి అబ్బిపురం గ్రామానికి చెందిన గోగుల జగదీష్ (12), పల్లపు సుధీర్ (10) కనిపించడం లేదని డయల్ 112కు సమాచారం అందింది. వెంటనే జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు సబ్-డివిజన్ ఏఎస్పీ సుస్మిత.ఆర్ పర్యవేక్షణలో బృందాలు ఏర్పడి గాలింపు ప్రారంభించాయి. సీసీటీవీ 360 యాప్‌లో అప్లోడ్ చేసిన ఫోటోలు ఆధారంగా రాత్రి 7:39 గంటలకు నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ కెమెరాలో జగదీష్ పేస్ మ్యాచ్ అయ్యింది. పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ జరిపి రాత్రి 11:30 గంటలకు ఇద్దరు పిల్లలను రోడ్డుపై గుర్తించారు.విచారణలో స్కూల్‌లో చిన్న తప్పు పని చేసినందుకు మేడమ్ మందలించడంతో తల్లిదండ్రులకు ఫిర్యాదు చేస్తారనే భయంతో ఇంటి నుంచి బయటకు వచ్చామని పిల్లలు తెలిపారు. అనంతరం పోలీసులు కౌన్సిలింగ్ చేసి వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిర్యాదు అందిన గంటన్నరలోపే పిల్లలను వెతికి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ, సబ్-డివిజన్ ఏఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పటిష్ట చర్యలు

- వలస కార్మికులు, బంధిత కార్మికుల మధ్య వ్యత్యాసంపై స్పష్టమైన అవగాహన అవసరం

- జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ: ఆగస్టు 5,2026.

జిల్లాలో బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. విజయవాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ బాండెడ్ లేబర్ సిస్టమ్ (అబాలిషన్) సమావేశంలో అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సమావేశం ప్రారంభంలో కమిటీ సభ్యులు బంధిత కార్మిక వ్యవస్థ (నిర్మూలన) చట్టం-1976 నిబంధనలు, అమలు విధానం, బాధితులను గుర్తించే ప్రక్రియ, పునరావాస చర్యలు తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి శాఖ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ వలస కార్మికులు స్వచ్ఛందంగా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేస్తారని, బంధిత కార్మికులు మాత్రం అప్పులు, బెదిరింపులు, బలవంతం లేదా ఇతర పరిస్థితుల కారణంగా యాజమాన్యానికి లోబడి పనిచేయాల్సిన పరిస్థితిలో ఉంటారని వివరించారు. ఈ రెండు వర్గాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అధికారులు స్పష్టంగా గుర్తించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన తర్వాతే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని క్వారీలు, ఇటుక బట్టీలు, ఇసుక బట్టీలు, ఇతర కార్మికులు అధికంగా పనిచేసే ప్రాంతాల్లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు తరచూ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బంధిత కార్మిక వ్యవస్థకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. క్వారీ యాజమాన్యాలు, ఇటుక బట్టీల నిర్వాహకులు, ఇతర పరిశ్రమల యజమానులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి బంధిత కార్మిక వ్యవస్థ (నిర్మూలన) చట్టంపై సమగ్ర అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే ఎదురయ్యే శిక్షలు, చట్టపరమైన పరిణామాలపై కూడా వారికి స్పష్టంగా వివరించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనలో స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సంబంధిత వ్యక్తులు వలస కార్మికులా, బంధిత కార్మికులా అన్న అంశాన్ని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. రెవెన్యూ, కార్మిక, పోలీసు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలతో పాటు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యాన్ని సమర్థవంతంగా సాధించగలమని పేర్కొన్నారు.సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి జి.ధనలక్ష్మి, వాసవ్య మహిళా మండలి సోషల్ వర్కర్ కె.విజయ, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధి రమాదేవి, ఎస్సీ సభ్యులు బూరుగు నారాయణ, సోషల్ వర్కర్ జి.తిరుపతిరావు, డీపీఓ మహాలక్ష్మి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.శివరాం ప్రసాద్, డీఆర్‌డీఏ అధికారి, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు

- హాకీ, అథ్లెటిక్స్ పోటీలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఎన్‌టీఆర్ జిల్లా -- విజయవాడతేదీ: 05 ఆగస్టు, 2026

ఎన్‌టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. బుధవారం విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంబీపీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన హాకీ, అథ్లెటిక్స్ పోటీలతో పాటు జిల్లా జట్టు ఎంపిక పోటీలను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. క్రీడాకారులతో ముచ్చటించి పోటీలు జరుగుతున్న తీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర స్థాయిలో ఎన్‌టీఆర్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. పోటీల నిర్వహణ, క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలు, మైదాన ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ డీఎస్ఏ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోటీలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేయడం పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో జులై 15 నుంచి ఆగస్టు 26 వరకు అమరావతి ఛాంపియన్‌షిప్--2026 పోటీలు జరుగుతున్నాయి. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, డీఎస్‌డీవో కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

(సమాచార, పౌర సంబంధాల శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా ద్వారా జారీ)

‘కరికాల’గా సందీప్ కిషన్..

రెండు భాగాలుగా భారీ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం!

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లో ఓ భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఆయన కథానాయకుడిగా ‘కరికాల’ అనే టైటిల్‌తో ఓ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం తెరకెక్కుతోంది. బుధవారం ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ రాజసం ఉట్టిపడే అవతారంలో కనిపించారు. ఓ అడవిలో గుర్రంపై కూర్చుని, చేతిలో పదునైన కత్తి పట్టుకుని శక్తివంతమైన యోధుడిగా దర్శనమిచ్చారు. పక్కనే సింహంతో అతడి గంభీరమైన లుక్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ‘శంబాల’ ఫేమ్ యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇది ఒక ఫాంటసీ చిత్రమని, భారీ విజువల్ ఎఫెక్ట్స్, విస్తృతమైన వరల్డ్ బిల్డింగ్‌తో దీన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. ‘కరికాల’ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. చాప్టర్-1ను 2027 జూలై 2న, చాప్టర్-2ను అదే ఏడాది అక్టోబర్ 28న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. తారాగణం, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని నిర్మాతలు తెలిపారు. ఇదిలా ఉండగా, సందీప్ కిషన్ ప్రస్తుతం ‘సిగ్మా’ అనే మరో చిత్రం విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. తమిళ స్టార్ హీరో విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా జూలై 31న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు ‘కరికాల’ ప్రకటనతో సందీప్ తన కెరీర్‌లోనే ఓ భారీ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు.

వరుణ్ తేజ్ ‘కొరియన్ కనకరాజు‘ ప్రీమియర్లు !

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన తదుపరి చిత్రం ‘కొరియన్ కనకరాజు‘ విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న విడుదల కానున్న ఈ సినిమాను ఒకరోజు ముందుగానే, అంటే ఆగస్టు 6న పెయిడ్ ప్రీమియర్ల రూపంలో ప్రేక్షకులకు చూపించేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాగా, అద్భుతమైన స్పందన లభిస్తుండటం సినిమాపై ఉన్న అంచనాలకు అద్దం పడుతోంది.ఇటీవల జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్ ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. రేపు (ఆగస్టు 6) సాయంత్రం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు థియేటర్లలో ప్రత్యేక పెయిడ్ ప్రీమియర్లు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సినిమా కంటెంట్‌పై తమకు ఉన్న గట్టి నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ ముందస్తు పాజిటివ్ టాక్‌ను సంపాదించుకోవడంలో కీలకం కానుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వస్తున్న ఈ హారర్-కామెడీ చిత్రంపై ముందు నుంచీ మంచి బజ్ ఉంది. విడుదలైన ట్రైలర్, టీజర్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. దీనికి తోడు తమన్ అందించిన సంగీతం కూడా శ్రోతలను ఆకట్టుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్స్‌కు అనూహ్య స్పందన వస్తోంది. ఆ వారం విడుదలవుతున్న ఐదు సినిమాల్లో ‘కొరియన్ కనకరాజు‘పైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై రాజీవ్ రెడ్డి, సాయి బాబా జాగర్లమూడి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించారు. వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, సత్య, దక్ష నగార్కర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వరుస ఫ్లాపుల తర్వాత వస్తున్న ఈ సినిమాతో వరుణ్ తేజ్ గట్టి కమ్‌బ్యాక్ ఇస్తారని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రీమియర్ల తర్వాత వచ్చే టాక్, ఆయన కెరీర్‌కు ఎంతవరకు బూస్ట్ ఇస్తుందో చూడాలి.

రాజకీయాలపై శోభిత ధూళిపాళ సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి, అక్కినేని నాగచైతన్య భార్య శోభితా ధూళిపాళ తన రాజకీయ భావజాలంపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీస్తున్నాయి. “నాకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే కచ్చితంగా విజయం సాధిస్తుంది“ అని ఆమె చెప్పిన మాటలు పెను దుమారమే రేపాయి.గ్లామర్ ఇండస్ట్రీలో ఉంటూ, తమ కెరీర్ దెబ్బతింటుందనే భయంతో ఏ హీరోయిన్ కూడా పొలిటికల్ ఐడియాలజీని బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. అలాంటిది శోభితా ధూళిపాళ ఎలాంటి దాపరికం లేకుండా, అత్యంత ధైర్యంగా తన మనసులోని అభిప్రాయాలను బయటపెట్టడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యక్తిగత భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ ఆమె నిజాయతీని కొనియాడుతున్నారు.అయితే, మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమలో నటిగా ఉంటూ, అత్యంత విలాసవంతమైన లైఫ్‌స్టైల్‌ను గడుపుతున్న శోభిత... కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదని కామెంట్స్ చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె చెప్తున్న సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా ఎంతవరకు సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.ఇక సినిమాల విషయానికి వస్తే, నాగచైతన్యతో వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న శోభిత..జ ‘చీకటిలో‘, ‘క్రాస్ రోడ్స్‘ వంటి ప్రాజెక్టులతో అలరించారు. ప్రస్తుతం ఇవి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ‘సిల్ బట్టా‘, ‘వెట్టువం‘ వంటి వినూత్న చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

ఉదయనిధి స్టాలిన్ సినిమాకు త్రిష నో చెప్పారా?

కొన్నాళ్ల క్రితం హిందూ మతంపై చేసిన వ్యాఖ్యలతో కొన్నాళ్లు వార్తల్లో నిలిచిన డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తాజా వివాదంతో మళ్లీ వార్తల్లో కెక్కారు. సినీ నటి త్రిషపై ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం మనకు తెలిసిందే. ఈ వివాదం నేపథ్యంలో, గతంలో వీరిద్దరి కాంబినేషన్ గురించి వెలువడిన వార్తలు మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఉదయనిధి సినిమాలో నటించేందుకు త్రిష నిరాకరించారని, రూ. 12 కోట్ల పారితోషికం ఆఫర్‌ను రిజెక్ట్ చేశారనే ప్రచారం మళ్లీ తెరపైకి వచ్చింది.2018లో దర్శకుడు కె.ఎన్. అధియమాన్ దర్శకత్వంలో ‘పంజెల్’ అనే టైటిల్‌తో ఒక సినిమా రాబోతుందని, అందులో త్రిష కథానాయికగా నటిస్తోందని వార్తలు రాగా, ఆ వార్తల్లో నిజం లేదని అప్పట్లోనే చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇక ఇటీవల ఉదయనిధికి చెందిన రెడ్ జెయింట్ మూవీస్ నిర్మాణంలో నటించేందుకు త్రిషకు రూ. 12 కోట్లు ఆఫర్ చేశారనే వార్త నెట్టింట చక్కర్లు కొట్టినప్పటికీ, దీనిపై త్రిష లేదా రెడ్ జెయింట్ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మీడియా సైతం దీనిని కేవలం ఒక పుకారుగా లేదా నిర్ధారణ లేని అంశంగానే పేర్కొంది.

తాను చదువుకున్న స్కూల్‌కు ధనుష్ అపురూప కానుక!

తాను చదువుకున్న పాఠశాలకు నటుడు ధనుష్ విలువైన కానుక అందించాడు. చెన్నైలోని సాలిగ్రామంలో ఉన్న తాయ్ సత్య మెట్రిక్యులేషన్ పాఠశాలకు మూడు అంతస్తుల కొత్త భవనాన్ని నిర్మించి విరాళంగా ఇచ్చాడు. ఈ కొత్త భవనానికి ‘ధనుష్ బ్లాక్’ అని పేరు పెట్టడం విశేషం.ధనుష్ పదో తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివాడు. ఇటీవల కొత్త భవనం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ధనుష్ తన స్కూల్ సహచరుడు, సినిమాటోగ్రాఫర్ కుమరన్‌తో కలిసి హాజరయ్యాడు. ఇద్దరూ 1999 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు.ఈ సందర్భంగా ధనుష్ తన ఉపాధ్యాయులందరి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నాడు. వారితో కలిసి ఫొటోలు దిగాడు. ఈ దృశ్యాలు అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేశాయి.ధనుష్‌తో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు కలిసి చదివిన కుమరన్, ఆయన భార్య లక్ష్మీ కృప కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కుమరన్ మాట్లాడుతూ.. పదో తరగతి వరకు తాము ముగ్గురూ ఇదే పాఠశాలలో చదివామని చెప్పాడు. ఆ తర్వాత ధనుష్‌తో కలిసి మరో పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశానన్నాడు. ధనుష్ సినీ రంగంలోకి వెళ్లగా, తాను ఇంజినీరింగ్ పూర్తి చేసి తర్వాత సినిమాటోగ్రాఫర్‌గా మారినట్టు తెలిపాడు. ‘తంగమగన్’ వంటి చిత్రాల్లో ధనుష్‌తో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేశాడు.పాఠశాల భవనాల పరిస్థితి గురించి తెలుసుకున్న ధనుష్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కొత్త భవనం నిర్మించారని కుమరన్ చెప్పాడు. అంతేకాదు, పాత భవనాలను పునరుద్ధరించడంతో పాటు ఖాళీ స్థలాల్లో మరిన్ని కొత్త భవనాలు కూడా నిర్మిస్తానని ధనుష్ హామీ ఇచ్చాడని వెల్లడించాడు. ఆయన చేసిన సాయం తమను ఎంతో కదిలించిందని అన్నాడు.ఇటీవల ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో ధనుష్ నటుడిగా ఒకటి, దర్శకుడిగా మరోటి ఇలా రెండు జాతీయ అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ‘ఓం’ చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు.

41 గంటలు నిర్విరామంగా షూటింగ్ లోనే కీర్తి సురేష్!

భారతీయ చలన చిత్ర పరిశ్రమలో పని గంటల వివాదం ఎంత సంచలనమైందో తెలిసిందే. సెట్ లో 8 గంటలు మించి పని చేయించుకోవడంపై చాలా మంది హీరోయిన్లు బాహాటంగా విమర్శలు చేసారు. పనికి తగ్గ పారితోషికం ఇవ్వడం లేదని..అలాంటప్పుడు ఎందుకు? పని చేయాలని మరికొంత మంది నటీమణులు తెరపైకి వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా కీర్తి సురేష్ ఏకంగా 41 గంటల పాటు నిర్విరామంగా పనిచేసి పని తనకు భారం కాదని నిరూపించారు. వివరాల్లోకి వెళ్తే..ఒకే సమయంలో పలు చిత్రాల షూటింగ్‌లతో బిజీగా ఉండటం వల్ల తాను పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ కీర్తి సురేష్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి.

ఇటీవలి కాలంలో విభిన్న భాషల్లో ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్న కీర్తి సురేష్ డేట్స్ సర్దుబాటు చేయడం కోసం ఎంతగా శ్రమించాల్సి వస్తుందో వివరించారు. ముఖ్యంగా ఒక పెద్ద ప్రాజెక్ట్ షూటింగ్ నుండి నేరుగా మరో సినిమా సెట్స్‌కు పరిగెత్తాల్సిన పరిస్థితుల్లో విశ్రాంతి లేకుండా పనిచేయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో ఏకంగా 41 గంటలపాటు ఎలాంటి నిద్ర లేకుండా మెలకువగానే ఉంటూ షూటింగ్‌లలో పాల్గొన్నానని సంచలన నిజం బయటపెట్టారు. చాలా సందర్భాల్లో సెట్ లో 12 గంటలకు మించి పనిచేసిన సందర్భాలున్నాయన్నారు. సినిమా పరిశ్రమ బయట నుంచి చూసే వారికి గ్లామర్‌గా కనిపిస్తుందని కానీ తెర వెనుక నటీనటులు పడే శ్రమ, పడే మానసిక , శారీరక ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. నిరంతరం ప్రయాణాలు చేస్తూ రాత్రింబవళ్లు తేడా లేకుండా పనిచేయడం వల్ల ఒక్కోసారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని తెలిపారు. అయినప్పటికీ వృత్తిపై ఉన్న అంకితభావంతోనే ఇన్ని కష్టాలను ఎదుర్కొని ముందుకు సాగుతున్నట్లు కీర్తి పేర్కొన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ .. ఇతర ఇండస్ట్రీలలో నటీనటులు, సాంకేతిక నిపుణుల కోసం 8 గంటల పని గంటల నిబంధనను తీసుకురావాలనే డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి.